




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 43 | మంగళవారం 8 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## మోడీ ప్రభుత్వం ధనవంతులను

# మరింత ధనవంతుల్ని చేస్తోంది

## - కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, జూలై 7

**మోడీ ప్రభుత్వం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) మార్కెట్‌లోని పెద్ద సంస్థల 'తారుమారు'పై మౌనంగా ఉండటం ద్వారా ధనవంతులను మరింత ధనవంతులుగా మారుస్తోంది. దీంతో సాధారణ పెట్టుబడిదారులు వినాశన అంచుకు నెట్టివేయబడుతున్నారు అని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ ఆరోపించారు.**

ఎఫ్ అండ్ ఓ మార్కెట్లలోని లొసుగులను తాను ఊహించానని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'నేను 2024లోనే స్పష్టంగా చెప్పాను. ఎఫ్‌అండ్‌ఓ మార్కెట్ 'పెద్ద పెట్టుబడిదారుల' ప్లేగ్రౌండ్‌గా మారింది. చిన్న పెట్టుబడిదారుల జేబులు మాత్రం నిరంతరం ఖాళీ అవుతున్నాయి అని రాహుల్ సోమవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. సెబి ఇప్పుడు స్వయంగా జేన్ స్ట్రీట్ వేలకోట్లను తారుమారు చేసిందని అంగీకరిస్తోంది. మరి సెబీ ఎందుకు ఇంతకాలం మౌనంగా ఉండిపోయింది? అని రాహుల్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్రం ఈ విషయాన్ని పట్టించుకోలేదని మార్కెట్‌ను మోసం చేసే వ్యక్తులు ఇంకెంతమంది ఉన్నారో అని ఆయన ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఎవరి ఆదేశం మేరకు మోడీ ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చుంది? ఇంకా ఎన్ని పెద్ద షార్క్‌లు రిటైల్ పెట్టుబడిదారులను తగ్గించుకుంటున్నాయి? ప్రతి సందర్భంలోనూ ఇది స్పష్టంగానే ఉంది. మోడీ ప్రభుత్వం ధనవంతులను మరింత ధనవంతులుగా మారుస్తోంది. సాధారణ పెట్టుబడిదారులను వినాశన అంచుకు

- మిగతా 2లో..

# టారిఫ్‌లను ఖండించిన బ్రిక్స్

## - ఇరాన్‌పై దాడులను వ్యతిరేకిస్తూ తీర్మానం

వాషింగ్టన్ - సూర్య వాస్తవం, జూలై 7

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన దిగుమతి సుంకాలను బ్రిక్స్ సదస్సు తీవ్రంగా ఖండించింది. అవి 'విచక్షణారహిత' సుంకాలని విమర్శించింది. డబ్ల్యుటిఓ నిబంధనలకు విరుద్ధంగా వున్నాయని పేర్కొంది. ఈ ఆంక్షల వల్ల అంతర్జాతీయ వాణిజ్యం క్షీణించే ప్రమాదం వుందని, ప్రపంచ సరఫరా గొలుసులకు ఆటంకం కలుగుతుందని, అనిశ్చితి నెలకొంటుందని పేర్కొంది.**

ఇటీవల ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా జరిపిన దాడులనూ తీవ్రంగా నిరసించింది. బ్రిక్స్ సభ్య దేశాలు ఈమేరకు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ మిలటరీ చర్యలను ప్రధానంగా ఖండించిన సదస్సు ఉక్రెయిన్ యుద్ధం గురించి కూడా ఒకసారి ప్రస్తావించింది.

బ్రిక్స్ సభ్య దేశాలు ప్రపంచ జనాభాలో సగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక ఉత్పత్తిలో ఈ దేశాల వాటా 40 శాతం వరకూ ఉంది. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్ వివిధ దేశాలపై పాల్పడుతున్న దాడులను బ్రిక్స్ తప్పుపట్టింది. రెండు రోజుల పాటు జరిగిన బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరు కాలేదు.




రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. సభ్య దేశమైన ఇరాన్‌కు మద్దతు తెలిపిన బ్రిక్స్ సదస్సు ఆ దేశంలోని అణు కేంద్రాలపై, ఇతర లక్ష్యాలపై ఇజ్రాయిల్, అమెరికా జరిపిన వరుస సైనిక దాడులను ఖండించింది. ఐక్యరాజ్య సమితిలోని ప్రతి సభ్య దేశమూ ఇజ్రాయిల్ చర్యలను తీవ్రంగా ఖండించాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ కోరారు.. హక్కుల ఉల్లంఘనలకు ఇజ్రాయిల్, అమెరికా బాధ్యత వహించాలని అన్నారు. యుద్ధా నంతర పరిణామాలు కేవలం ఒక్క దేశానికే పరిమితం

- మిగతా 2లో..




# టీడీపీలో కష్టపడేవారికే పదవులు..

- రాజీపడే ప్రసక్తే లేదు: మంత్రి లోకేశ్
- ఈ నెలాఖరులోగా ఏఎంసీ, దేవాలయ కమిటీల నియామకం పూర్తి చేస్తామన్న మంత్రి
- గత పొరపాట్లు పునరావృతం కానివ్వం.. పార్టీలో సంస్కరణలు తెస్తామని వెల్లడి
- ప్రతి 4 నెలలకోసారి కేడర్ ప్రజల్లోకి వెళ్లేలా ప్రత్యేక కార్యక్రమాలకు ప్రణాళిక
- త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఈ ఏడాదే నిరుద్యోగ భృతి ఇస్తామన్న లోకేశ్

నెల్లూరు - సూర్య వాస్తవం, జూలై 7

టీడీపీలో ఇకపై కష్టపడి పనిచేసే వారికే పదవులు దక్కుతాయని, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి గౌరవించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు. నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ పాల్గొని కీలక ప్రసంగించారు. గతంలో

- మిగతా 2లో..

## టెక్నాలజీతో

# జీరో క్రైం రేట్ సాధించాలి

## - సిఎం చంద్రబాబు నాయుడు



- రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం చంద్రబాబు సమీక్ష
- క్రైమ్ హాట్ స్పాట్స్‌పై సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ
- పిడుగులు పడే ప్రదేశంలో ముందుగానే సైరన్ హెచ్చరికలు

అమరావతి- సూర్య వాస్తవం, జూలై 7

టెక్నాలజీని వినియోగించుకుని జీరో క్రైమ్ రేట్ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. సాంకేతికత వినియోగించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ ను ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలని స్పష్టం చేశారు. సోమవారం నాడు ఏపీ సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాలతో క్రైమ్ హాట్ స్పాట్లపై నిరంతరం నిఘా పెట్టి నేరాల నియంత్రణ చేయాలన్నారు. దీంతో పాటు ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజి వ్యవహారంలోనూ నిబంధనలు మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు కెమెరాలను కూడా వినియోగించుకునేలా చూడాలని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవా లన్నారు. కొందరు తెలివిగా నేరాలు చేసి.. దాన్ని ప్రభుత్వంపై నెడుతున్నారని.. పోలీసులకు సహకరించని వ్యక్తులు, నేతల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారి కోసం పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద వారి వద్ద నుంచి డేటాను తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా నేరాలకు బాధ్యులుగా చేసే అంశంపైనా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రజా భద్రత కోసం.. నేరాల కట్టడి కోసం.. దర్యాప్తు నిమిత్తం.. షాపింగ్ మాల్స్, థియేటర్లు, హోటళ్ల వద్ద ఉండే సీసీ కెమెరాల్లోని ఫుటేజీని సేకరించే వంటి వాటి విషయాల్లోనూ పబ్లిక్ సేఫ్టీ యాక్టును వర్తింప చేయాలన్నారు. మరోవైపు వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ**

వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులను కూడా పూర్తి స్థాయి ప్రక్షాళన చేసి నూతన సాంకేతికతనే

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# సమస్యలపై పోరాడుదాం

- మంచి రోజులు రానున్నాయి
- ప్రజాదర్బార్‌లో మాజీ సిఎం జగన్



పులివెందుల - సూర్య వాస్తవం, జూలై 7

**'మంచి రోజులు రానున్నాయి ఓపికతో ఉండాలి.. సమస్యలపై పోరాడుదాం' అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.**

సోమవారం ఆయన బెంగళూరు నుంచి వైఎస్ఆర్ జిల్లా భాకరాపురానికి హెలికాప్టర్‌లో వచ్చారు. అక్కడి నుంచి పులివెందులలోని వైసిపి క్యాంప్ కార్యాలయానికి చేరుకొని అక్కడ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసేందుకు నియోజకవర్గం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలువురు వారి సమస్యలను విన్నవించుకున్నారు. ఇటీవల

- మిగతా 2లో..

## వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ వివాదం...

## విద్యార్థుల సమస్యను

# వెంటనే పరిష్కరించాలి

- చంద్రబాబు, పవన్ సమాధానం చెప్పాలన్న షర్మిల
- సీఓఏ గుర్తింపు లేకుండా అడ్మిషన్లపై యాజమాన్యాన్ని నిలదీత
- గత వైసీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- జగన్, అవినాశ్‌తో పాటు చంద్రబాబు, పవన్‌పైనా విమర్శలు
- విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్



2లో

## మోడీ ప్రభుత్వం ధనవంతులను మరింత ధనవంతుల్ని చేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

నెట్టివేస్తోంది అని అన్నారు. రాహుల్ తాను చేసిన పోస్టుకి 2024 సెప్టెంబర్ 21 నాటి పోస్టును ట్యాగ్ చేశారు. ఆ పోస్టులో రాహుల్ 'నియంత్రణ లేని ఎఫ్అండ్ ఓ ట్రేడింగ్ 5 సంవత్సరాలలో 45 రెట్లు పెరిగింది. 90 శాతం చిన్న పెట్టుబిదారులు 3 సంవత్సరాలలో 1.8 లక్షల కోట్లు కోల్పోయారు అని ఆ పోస్టులో రాసుకొచ్చారు.
నేడు (జూలై 7) సెబీ ఛైర్మన్ తుహీన్ కాంత పాండే హెడ్జ్ ఫండ్ జేన్ స్ట్రీట్ చేసిన అవకతవకల వంటి 'అనేక ఇతర నష్టాలను' మూలధన మార్కెట్ నియంత్రణ సంస్థ చూడలేదని అన్నారు. ఈయన వ్యాఖ్యలపై స్పందించి రాహుల్ మార్కెట్ అవకతవకలపై ప్రశ్నించారు.

## టారిఫ్‌లను ఖండించిన బ్రిక్స్

(మొదటిపేజీ తరువాయి)

కావని అన్నారు. దీనివల్ల మధ్యప్రాచ్యంతో పాటు ఇతర ప్రాంతాలు కూడా నష్టపోతాయని తెలిపారు. గాజాలో నెలకొన్న మానవతా సంక్షోభంపై బ్రిక్స్ నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బందీలందరినీ విడుదల చేయాలని, ఇరు పక్షాలు చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. సమస్యను ద్వైపాక్షికంగానే పరిష్కరించుకోవాలని అభిప్రాయపడ్డారు.

**బ్రిక్స్ దేశాలపై 10శాతంఅదనపు టారిఫ్ : ట్రంప్**

బ్రిక్స్ సభ్య దేశాలపై డోనాల్డ్ ట్రంప్ నిప్పులు చెరిగారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా సహా బ్రిక్స్‌లోని 11 దేశాలపై మరో పది శాతం సుంకం విధిస్తానని బెదిరించారు. 'అమెరికా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బ్రిక్స్‌తో ఏ దేశం జత కట్టినా దానిపై మరో పది శాతం సుంకాన్ని విధిస్తాం. దీనికి మినహాయింపులేవీ వుండవు' అని ఆదివారం తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ హెచ్చరించారు.

## టీడీపీలో కష్టపడేవారికే పదవులు..

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన పొరపాట్లను పునరావృతం చేయబోమని, పార్టీలో ఏమైనా తప్పులు జరిగితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు ఈ నెలాఖరులోగా నామినేటెడ్ పదవులైన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ), దేవాలయ కమిటీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు, ప్రతి నాలుగు నెలలకోసారి కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లేలా సరికొత్త కార్యక్రమాలను రూపొందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై లోకేశ్ విమర్శలు గుప్పించారు. "సొంత కార్యకర్తలను కారు కింద తొక్కేసిన నేత జగన్. కనీసం వారిని పరామర్శించేందుకు కూడా వెళ్లలేదు. కానీ కందుకూరు దుర్ఘటన జరిగినప్పుడు చంద్రబాబు ప్రతి ఇంటికీ వెళ్లి క్షమాపణ చెప్పారు. మనకి, వాళ్లకి ఇదే తేడా" అని లోకేశ్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే ఆలోచించి, ప్రజలతో మమేకమై పనిచేయాలని ఆయన కేడర్‌కు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని, త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఈ ఏడాదిలోనే నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేస్తున్నామని, మిగిలిన ఉద్యోగాలను కూడా పద్ధతి ప్రకారం భర్తీ చేస్తామని లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## సమస్యలపై పోరాడుదాం

(మొదటిపేజీ తరువాయి)

వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టిన విషయాన్ని నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జగన్ స్పందిస్తూ.. 'ధైర్యంగా ఉండండి.. వచ్చేది మన ప్రభుత్వమే.. మీకు ఎప్పుడు అండగా ఉంటాను' అని భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాలలో కోతలు విధిస్తున్నారని, అర్హత ఉన్నా పథకాలు అందడంలేదని తెలిపారు. దీనిపై న్యాయ పోరాటం చేసి ప్రతి ఒక్కరికి మేలు జరిగేలా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు. సోమవారం రాత్రి జగన్ ఇక్కడే బస చేశారు. మంగళవారం ఉదయం వేంపల్లి మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. తిరిగి పులివెందుల క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు.

## చంద్రబాబుకు ఆరోగ్య రొట్టె పట్టుకున్న లోకేష్



**నెల్లూరు - సూర్య వాస్తవం, జూలై 7**

నెల్లూరు నగరంలో జరుగుతున్న రొట్టెల పండగకు జనం పోటెత్తారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన, మతసామరస్యానికి ప్రతీకంగా నిల్చిన ఈ పండగకు సోమవారం గంధమహోత్సవం కావడంతో భారీగా తరలొచ్చారు. ఏదారి చూసినా బారాషాహీద్ దర్గా వైపే వెళ్లింది. దీంతో, స్వర్ణాల చెరువు జనంతో నిండిపోయింది. సాయంత్రం నాలుగు గంటలకు బారాషాహీద్ దర్గాకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వచ్చారు. ముస్లిం పెద్దలు స్వాగతం పలికి ఆయనను సంప్రదాయ దుస్తులతో సత్కరించారు. దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల అనంతరం అక్కడి నుంచి స్వర్ణాల చెరువుకు లోకేష్ వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరోగ్యం బాగుండాలంటూ ఆరోగ్య రొట్టె పట్టుకున్నారు. లోకేష్ వెంట మంత్రి ఫరూక్, పి.నారాయణ, ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

# టెక్నాలజీతో జీరో క్రైం రేట్ సాధించాలి

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించి భద్రంగా ఉండేలా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం డేటా లేక్ ద్వారా సమన్వయం చేయాలని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు 517 పౌరసేవల్ని వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్నట్టు అధికారులు వివరించారు. అయితే అందిస్తున్న సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పిడుగులు పడే ప్రాంతాల్లో విలువైన ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని.. ముందస్తు హెచ్చరికల వ్యవస్థ సమర్ధంగా పనిచేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ముందుగానే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పర్యవేక్షణకు ఫీజియో మీటర్లు, సెన్సార్లు త్వరితగతిన పునరుద్ధరించాలని అన్నారు. రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీరెంత, ఎంతమేర ప్రవాహాలు వస్తున్నాయి. సముద్రంలోకి విడుదల చేస్తున్న నీరెంత లాంటి వివరాలు నమోదు చేయాలన్నారు. రిజర్వాయర్లలో వచ్చే ప్రవాహాలకు సంబంధించిన వివరాలను రియల్ టైమ్ లో పర్యవేక్షిస్తే వరద నిర్వహణ చేయొచ్చన్నారు. ప్రస్తుతం వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లనూ పూర్తి సామర్ధ్యంతో నింపుతున్నట్టు సీఎం స్పష్టం చేశారు. మరోవైపు సముద్ర తీరప్రాంతాల్లో అలల ఉధృతి, చేపల వేటకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ఇన్ కాయిస్ సంస్థ ఇచ్చే వివరాలను మత్స్యకారులకు, తీరప్రాంతాల్లోని వారికి అందేలా చూడాలని స్పష్టం చేశారు.

**ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాల రూపకల్పన**

ప్రతీ ప్రభుత్వ శాఖ తమ దగ్గర ఉన్న లబ్దిదారుల డేటా సహా ఇతర వివరాలను ఆర్టీజీఎస్ తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యత్యాసం ఉంటే తక్షణం ఆర్టీజీఎస్ కు తెలిపి డేటాను సవరించుకోవాలని స్పష్టం చేశారు. 2029 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అందుకు తగినట్టుగా సంక్షేమ పథకాల రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి అన్నారు. పేదరిక నిర్మూలన కోసం చివరి వ్యక్తి వరకూ చేయూత అందించటమే కూటమి ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. పీ4లో భాగంగా బంగారు కుటుంబం- మార్గదర్శి అనుసంధాన ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సీఎం స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ వివాదం...

# విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించాలి

- చంద్రబాబు, పవన్ సమాధానం చెప్పాలన్న షర్మిల
- సీఓఏ గుర్తింపు లేకుండా అడ్మిషన్లపై యాజమాన్యాన్ని నిలదీత
- గత వైసీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- జగన్, అవినాశ్‌తో పాటు చంద్రబాబు, పవన్‌పైనా విమర్శలు
- విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్

**కడప- సూర్య వాస్తవం, జూలై 7**

వైఎస్సార్ కడప జిల్లాలోని ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని, దీనికి గత వైసీపీ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని... దీనికి సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఆమె సోమవారం మద్దతు తెలిపి, వారి సమస్యలపై తీవ్రంగా స్పందించారు.

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీవోఏ) నుంచి తప్పనిసరి అనుమతులు లేకుండా 2020లో విద్యార్థులను ఎలా చేర్చుకున్నారని ఆమె యూనివర్సిటీ యాజమాన్యాన్ని నిలదీశారు. "ఒక్కో విద్యార్థి సుమారు రూ.15 లక్షలు ఖర్చుపెట్టి ఐదేళ్ల కోర్సు పూర్తి చేయబోతున్నారు. ఈ సమయంలో వారి సర్టిఫికెట్లకు విలువ ఉంటుందో లేదో తెలియని పరిస్థితి నెలకొనడం అత్యంత బాధాకరం" అని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు మాజీ ముఖ్యమంత్రి జగన్, స్థానిక ఎంపీ అవినాశ్ రెడ్డి నిర్లక్ష్యమే కారణమని ఆమె ఆరోపించారు. "అధికారంలో ఉన్నప్పుడు సీఓఏ అనుమతుల కోసం వారెందుకు ప్రయత్నించలేదు? ఢిల్లీలోనే ఉండే సీఓఏతో ఎంపీ అవినాశ్ రెడ్డి ఎందుకు మాట్లాడలేదు?" అని ఆమె ప్రశ్నించారు.
అదే సమయంలో, గత ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దాల్సిన బాధ్యత ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉందని షర్మిల స్పష్టం చేశారు. "కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది.

అయినా ఈ చిన్న విషయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు? విద్యార్థుల సర్టిఫికెట్లకు విలువ లేకపోతే వారి భవిష్యత్తు ఏమిటి? అని నిలదీశారు. విద్యార్థుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆమె తెలిపారు.

# ప్రతిపక్షంలో ఉన్నా జగన్ వైఖరి మారలేదు

### - మంత్రి లోకేశ్

- అధికారం పోయినా ఇంకా హెలికాప్టర్‌లోనే తిరుగుతున్నారని విమర్శ
- పల్నాడు పర్యటనలో కార్యకర్త మృతిపై జగన్ తీరును తప్పుబట్టిన లోకేష్
- కారు కిందపడ్డ కార్యకర్తను కనీసం చూడలేదని తీవ్ర ఆరోపణ
- బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లను వైసీపీ ప్రోత్సహించిందని వ్యాఖ్య
- నెల్లూరులో టీడీపీ నేతలతో మంత్రి సమన్వయ సమావేశం

**నెల్లూరు - సూర్య వాస్తవం, జూలై 7**

"మీ తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మా పార్టీకి చెందిన 164 మంది కార్యకర్తలను పొట్టనబెట్టుకున్నారు. ఆనాడే మేము భయపడలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయిన మీ బెదిరింపులకు భయపడతామా?" అంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్షంలోకి వచ్చినా జగన్ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని, ఆయన పర్యటనలంటేనే ప్రజల ప్రాణాలు తీయడమని ఘాటుగా విమర్శించారు. నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో టీడీపీ పట్టణ నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా మనుషుల్ని చంపుకుంటూ వెళుతున్నారు, పల్నాడు జిల్లా పర్యటనలో ఒకరిని పరామర్శించడానికి వెళ్లి ముగ్గురిని చంపారు. ఒకరిని కారు కింద పడేసి చంపారు. రెండో వ్యక్తి ఊపిరాడక చనిపోయారు. మూడో వ్యక్తి అంబులెన్స్ లో ఇరుక్కుపోయారు.

జనసమీకరణ మనం చేయలేక కాదు.. మనవల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదు. కార్యకర్త కారు కిందపడితే కనీసం దిగి చూడలేదు. కార్యకర్తను రోడ్డున పక్కన పడేసి వెళ్లిపోయారు. దిగి చూసి ఆసుపత్రికి పంపించి ఉంటే బతికేవాడు. బాధిత కుటుంబం తల్లిని తీసుకువచ్చి కనీసం కూర్చోపెట్టలేదు. గ్లాస్ మంచినీరు అయినా ఇచ్చారా? సొంత కార్యకర్త చనిపోతే నిల్చొని రెండు భుజాలు తట్టి వెళ్లిపోయారు. వైసీపీ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బ్లేడ్ బ్యాచ్ ను, గంజాయి బ్యాచ్ ను ప్రోత్సహిస్తున్నారు. మీ తండ్రి హయాంలోనే 164 మంది కార్యకర్తలను చంపారు. అప్పుడే భయపడలేదు, మీ రప్పా, రప్పాకు భయపడతామా? ప్రతిపక్షంలో ఉండగా బాబు గారి ఇంటి గేటుకు తాళ్లు కట్టారు. వీరు మాట్లాడతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా తిరిగే హక్కు ఉంది. తిరగమంటే మనుషులను చంపుతున్నారు. నిబంధనలు పాటించమంటే ఎదురుదాడి చేస్తున్నారు. చిన్నసందులో వెళ్తా, మరో ముగ్గురుని చంపుతా అంటున్నారు.

**టీడీపీ కార్యకర్తలు అలక మానుకోవాలి**

"మనకు ఉన్న పెద్ద జబ్బు అలగడం. పార్టీలో సంస్కరణల కోసం నేను పోరాడుతున్నా. కొన్ని నిర్ణయాలు తప్పు కావచ్చు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం పోరాడుతున్నా. ఒక్కసారి చంద్రబాబు గారు నిర్ణయం తీసుకున్న తర్వాత తలవంచి పనిచేస్తా. పార్టీ ఫస్ట్, కార్యకర్తలు పస్ట్. కార్యకర్తలు అలక మానుకోవాలి. మన సమస్యలు కలిసికట్టుగా కూర్చొని మనమే పరిష్కరించుకోవాలి..." అని లోకేశ్ హితవు పలికారు.

**1500 మందిని కలిసిన లోకేశ్**

సమన్వయ సమావేశం అనంతరం దాదాపు 1500 మందిని మంత్రి నారా లోకేష్ కలిశారు. వివిధ సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కరించి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రతిఒక్కరితో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి.నారాయణ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర యాదవ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఖాదీ అండ్ ఇండస్ట్రీస్ బోర్డు ఛైర్మన్ కేపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## మోడీ దిగ్రేట్.... 25 దేశాల అవార్డులు..

**న్యూఢిల్లీ,- సూర్య వాస్తవం**


ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ట్రినిడాడ్-టొబాగో అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్-టొబాగో' లభించింది. ఈ గౌరవాన్ని ఆ దేశ అధ్యక్షురాలు క్రిస్టీన్ కంగలూ ఆయనకు ప్రదానం చేశారు. ఇది ఒక విదేశీ దేశం ప్రధానమంత్రి మోడీకి ఇచ్చిన 25వ అంతర్జాతీయ గౌరవం. గతంలో, రష్యా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్ సహా అనేక దేశాల నుండి ఆయన అత్యున్నత గౌరవాలను కూడా అందుకున్నారు. ఇప్పటి వరకు విదేశాల అత్యున్నత పురస్కారాలు పొందిన ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారు. ఈ గౌరవంతో, ప్రధానమంత్రి మోదీ రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్-టొబాగో చరిత్రలో ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న తొలి విదేశీ నాయకుడిగా నిలిచారు. ఈ గౌరవాన్ని భారత్-ట్రినిడాడ్ మధ్య బలమైన ద్వైపాక్షిక సంబంధాలు, ప్రపంచ వేదికలలో భారతదేశం చురుకైన పాత్ర, ప్రధానమంత్రి మోదీ నాయకత్వానికి గుర్తింపుగా భావిస్తున్నారు. అత్యున్నత జాతీయ పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో'ను అందుకున్నందుకు మీకు, మీ ప్రభుత్వానికి, మీ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని' ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. 140 కోట్ల మంది భారతీయుల తరపున ఈ గౌరవాన్ని నేను ఉమ్మడి గర్వంగా అంగీకరిస్తున్నాను. ఈ గౌరవం మొదటిసారిగా ఒక విదేశీ నాయకుడికి ఇవ్వడటం మన ప్రత్యేక సంబంధాల బలాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ సంబంధం మన ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వంపై ఆధారపడి ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

180 సంవత్సరాల క్రితం భారతదేశం నుండి ఇక్కడికి వచ్చిన ప్రజలు మన స్నేహానికి పునాది వేశారని ప్రధాని మోదీ అన్నారు. వారి చేతులు ఖాళీగా ఉన్నప్పటికీ, వారి మనస్సులు భారతీయ నాగరికత, సంస్కృతి, వైవిధ్యంతో సమృద్ధిగా ఉన్నాయి. వారు నాటిన పరస్పర సామరస్యం, సద్భావన విత్తనాలు నేడు ట్రినిడాడ్ సాకారం అవుతున్నాయి. మన ఉమ్మడి సంప్రదాయం, సంస్కృతి, ఆచారాలను ఇప్పటికీ భారతీయ సమాజం పరిరక్షించడం చాలా గర్వకారణం అని ప్రధాని మోదీ కొనియాడారు. అధ్యక్షుడు కనగలును ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ, మీ పూర్వీకులు తమిళనాడుకు చెందినవారని, ఇది తిరువళ్ళువర్ జీ పుట్టిన ప్రదేశం అని అన్నారు. బలమైన దేశాలకు 6 విషయాలు ఉండాలని తిరువళ్ళువర్ జీ అన్నారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ధైర్యవంతులైన సైన్యం, దేశభక్తిగల పౌరులు, వనరులు, మంచి ప్రజా ప్రతినిధులు, బలమైన రక్షణ, ఎల్లప్పుడూ మనతో పాటు నిలిచే స్నేహపూర్వక దేశాలు. ట్రినిడాడ్-టొబాగో భారతదేశానికి చాలా స్నేహపూర్వక దేశం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, ట్రినిడాడ్ అధ్యక్షురాలు క్రిస్టీన్, ప్రధాని కమలాతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరిపారు. ట్రినిడాడ్ పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. 1999 తర్వాత భారత ప్రధాని ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశంలో పర్యటించడం ఇదే తొలిసారి.

# సంపాదకీయం

## బ్యూటీ ఫుల్ బిల్

### - ఎవరికి లాభం...ఎవరికి నష్టం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతో ఇంట్రెస్ట్‌గా తీసుకొచ్చిన వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో ఎవరికి లాభం.. ఎవరికి నష్టం అన్న చర్చలు జరుగుతున్నాయి. ఆహా ఓహో అని వైట్ హౌజ్, ట్రంప్, రిపబ్లికన్లు ప్రచారాలు పెంచారు. అదే సమయంలో ధనవంతులకే లాభం చేసి పేద అమెరికన్ల పొట్టకొట్టేలా ఉందని రిపబ్లికన్లు కార్నర్ చేస్తున్నారు940 పేజీల బిల్లు అమెరికాలో పెద్ద చర్చకే దారి తీసింది. ప్రభుత్వ వ్యయాన్ని తీవ్రంగా తగ్గించడం, వలస చట్టాలను అమలు చేయడానికి కావాల్సిన కఠినమైన కొత్త విధానాలకు నిధులు సమకూర్చడం, పలు పన్ను కోతలను శాశ్వతం చేయడం వంటివి ఈ చట్టంలో ఉన్నాయి. అమెరికా రాజకీయాల్లో, ఇటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉండడంతో ఈ బిల్లు అందరి అటెన్షన్ కు కారణమైంది.. 2017లో అమల్కైన పన్ను కోతలను శాశ్వతం చేయడం ద్వారా, ఈ బిల్లు అమెరికన్లకు సంవత్సరానికి సగటున 2,900 డాలర్లు ఆదా చేస్తుందని ట్యాక్స్ పాలసీ సెంటర్ అంచనా వేసింది. మధ్యతరగతి, అధిక ఆదాయం గల వ్యక్తులు అంటే ఏటా 30 వేల డాలర్ల నుంచి 80 వేల డాలర్లు సంపాదించేవారికి 15% ట్యాక్స్ తగ్గింపును పొందుతారు. ఇది వారి టేక్ హోమ్ పే ని ఏడాదికి 10 వేల డాలర్ల నుంచి 13 వేల డాలర్లకు పెంచనుంది. అధిక ఆదాయం ఉన్న వారు, అలాగే వారసత్వ ఆస్తులు ఉన్నవారు భారీగా ట్యాక్స్ రాయితీలు పొందుతారు. అటు మధ్యతరగతి కుటుంబాలు ట్యాక్స్ రిలీఫ్ ద్వారా రిలీఫ్ పొందుతాయి. ముఖ్యంగా పిల్లలు ఉన్నవారు. ఇక ఏటా 9 లక్షలకు పైగా డాలర్లు సంపాదించే వారికీ బెనిఫిట్స్ ఇచ్చారు ట్రంప్. కార్పొరేట్ కంపెనీలకు లాభం జరగనుంది. ఓవర్‌టైమ్‌పై 12,500 డాలర్లకు నో ట్యాక్స్ కట్. టిప్స్ లేదా ఓవర్‌టైమ్ ద్వారా సంపాదించే ఆదాయంపై 2028 వరకు ట్యాక్స్ రాయితీ ఉంటుంది. దీనివల్ల ఈ వర్గాల వారు సంవత్సరానికి 1,300 నుంచి 2 వేల డాలర్లు ఆదా చేయవచ్చు. టిప్స్‌పై 25 వేల డాలర్లు, ఓవర్‌టైమ్‌పై 12 వేల 500 డాలర్ల దాకా సంపాదించే వారికి ట్యాక్స్ డిడక్షన్ బెనిఫిట్. 65 ఏళ్లు పైబడిన వారికి అదనపు 4,000-6,000 డాలర్ల స్టాండర్డ్ డిడక్షన్ లభిస్తుంది. 88% సీనియర్స్‌కు ట్యాక్స్ రహిత బెనిఫిట్స్ అందిస్తుంది. అటు అమెరికన్ తయారీ కంపెనీలు, అలాగే చిన్న వ్యాపారాలకు 100 శాతం ఎక్స్‌పెన్సింగ్ అలాగే ట్యాక్స్ రాయితీలు ఈ బ్యూటిఫుల్ బిల్లుతో లభిస్తాయి. దీనివల్ల వారు ఎక్కువ ఉద్యోగాలను సృష్టించవచ్చు. వ్యాపార విస్తరణకు మేలు, అలాగే దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. 20 లక్షల రైతు కుటుంబాలకు మేలు. ఎస్టేట్ ట్యాక్స్ ఎక్సెంప్షన్ రెట్టింపు కావడం వల్ల 20 లక్షల రైతు కుటుంబాలు తమ ఆస్తులను వారసత్వంగా ఇవ్వడంలో ట్యాక్స్ భారం నుండి రక్షణ పొందుతారు. దీంతో అమెరికన్ రైతులకు ఆర్థిక స్థిరత్వం లభిస్తుంది. అమెరికన్ తయారీ కార్లపై ఆటో లోన్ ఇంట్రెస్ట్ డిడక్షన్ ఇచ్చారు. దీంతో అమెరికన్ కార్ల కొనుగోలును ప్రోత్సహిస్తుంది. దేశీయ ఆటోమొబైల్ రంగానికి బూస్ట్ ఇచ్చేలా బిల్లులో ప్రస్తావించారు. అటు సైనిక రంగంలో ఆధునీకరణ, జాతీయ భద్రత, ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఉద్యోగ సృష్టి, మౌలిక సదుపాయాల వృద్ధి కోసం బెనిఫిట్స్ కల్పించారు.డ్రగ్ ట్రాఫికింగ్ నిరోధానికి, ఆర్కిటిక్‌లో జాతీయ భద్రత, సముద్ర రవాణా రంగంలో బలోపేతం అయ్యేలా బిల్లులో ప్రోత్సహించారు. ఏవియేషన్ రంగంలో సామర్థ్యం, భద్రత పెంచడానికి చర్యలు తీసుకున్నారు.

చారిటబుల్ డొనేషన్స్‌ను ప్రోత్సహించేలా బిల్లు ఉంది. ఇది నాన్-ప్రాఫిట్ సంస్థలకు ఫండిరగ్ పెంచబోతోంది. న్యూక్లియర్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు, వృద్ధికి ప్రోత్సాహం కల్పించారు. విద్యార్థుల లోన్లనూ టార్గెట్ చేసిన ట్రంప్. ఇక ఈ బ్యూటిఫుల్ ట్యాక్స్ బిల్లుతో ఎవరికి నష్టమో ఇప్పుడు చూద్దాం. తక్కువ ఆదాయం ఉన్న వారిపై ట్రంప్ గట్టి దెబ్బే కొట్టాడు. సంవత్సరానికి 17 వేల డాలర్ల కంటే తక్కువ సంపాదించే వారికి మెడికేడ్, ఆహార కోతల వల్ల సగటున 1,600 డాలర్ల నుంచి 22 వేల డాలర్లు నష్టపోవచ్చుంటున్నారు. అసలు బెనిఫిట్ చేయాల్సిందే పేద అమెరికన్లకు. కానీ ట్రంప్ మాత్రం ఎందుకో పేద అమెరికన్ల పొట్టగొట్టాడంటున్నారు అక్కడి డెమొక్రాట్లు, సామాజిక సంస్థలు. అలాగే విద్యార్థుల లోన్లనూ టార్గెట్ చేశారు. స్టూడెంట్స్, అలాగే వర్సిటీలకు నష్టం. క్లీన్ ఎనర్జీ రంగానికి ట్యాక్స్ క్రెడిట్స్ మైనస్. అటు క్లీన్ ఎనర్జీ రంగానికి ట్యాక్స్ క్రెడిట్స్ మైనస్ చేశారు. దీంతో సోలార్, విండ్, ఎలక్ట్రిక్ వెహికల్ రంగాలకు షాకింగ్ గా మారింది. ఈ బిల్లు స్పేస్ బేస్డ్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్ ? గోల్డెన్ డోమ్ కోసం ఫండిరగ్‌ను కేటాయించినప్పటికీ, అంతరిక్ష రంగంలో ప్రైవేట్ కంపెనీలకు అంటే జెఫ్ బెజోస్ సహా మస్క్ కు చెందిన స్పేస్ ఎక్స్ వంటి వాటికి నేరుగా ట్యాక్స్ ఇన్సెంటివ్స్ లేదా ఫండిరగ్ పై స్పష్టత ఇవ్వలేదు. ఎలాన్ మస్క్ ఈ బిల్లును విమర్శించడానికి ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటి. అటు వలసదారులకు వీసా ఫీజుల్ని పెంచారు. చాలా సబ్సిడీల నుండి ఇమ్మిగ్రెంట్స్‌ను మినహాయించేశారు. దీంతో అమెరికాలో చట్టబద్ధంగా ఉన్న వలసదారులు చాలా నష్టపోతారు. సో ఈ బిల్లు వల్ల ఫెడరల్ డెఫిసిట్ వి3.3-వి3.8 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని, దీనివల్ల భవిష్యత్ తరాలపై రుణ భారం పెరుగుతుందంటున్నారు. సోఈ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు ట్రంప్ ఉత్సాహంగా తీసుకొచ్చినా లాభ నష్టాలపై ఇంకా ఆందోళన తొలగడం లేదు. అమెరికా నుంచి ఇండియాకు డబ్బులు పంపడానికి లిమిట్ పెట్టారా.. వచ్చే ఏడాది జనవరి 1 నుంచే ఔఖీఎల నెత్తిపై ట్రంప్ పెద్దబాంబే పెట్టాడు. 2026 జనవరి 1 నుంచి అమెరికా నుంచి భారత్‌కు పంపే క్యాష్ ఆధారిత ట్రాన్స్ ఫర్స్ పై 1% పన్ను విధించారు. తరచూ ఇండియాకు డబ్బు పంపే వారికి భారమే. క్యాష్, మనీ ఆర్డర్, చెక్కుల రూపంలో పంపేవాటికి ఇది వర్తిస్తుంది. మొదట ఇది 5%గా ప్రతిపాదించారు. తర్వాత 3.5%కి తగ్గించి చివరకు ఒత్తిళ్లతో 1 శాతంగా డిసైడ్ చేశాడు ట్రంప్. ఇది చిన్న మొత్తంగా అనిపించినా.. తరచూ ఇండియాకు డబ్బు పంపే కుటుంబాలకు ఇది లక్షల్లో అదనపు భారం కానుంది. అయితే డిజిటల్ మార్గాల్లో పంపే వారు పన్ను నుంచి తప్పించుకోవచ్చు. అయితే.. భారత్‌లో గ్రావిరీణ ప్రాంతాల్లో, అలాగే వయసు పైబడిన తల్లిదండ్రులకు నగదే అలవాటుగా ఉంది.

ఉదాహరణకు ఏడాదికి 6 వేల డాలర్లు పంపే వ్యక్తికి 60 డాలర్లు అంటే 5 వేల రూపాయలు అదనంగా ట్యాక్స్ చెల్లించాలి. 1శాతం రెమిటెన్స్ ట్యాక్స్ ఎఫెక్ట్ తో మన ఎకానమీపై భారం. బిగ్ బ్యూటిఫుల్ బిల్ ద్వారా అమెరికా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1శాతం రెమిటెన్స్ ట్యాక్స్ ఎఫెక్ట్ కేవలం ప్రవాస భారతీయులకే కాదు, భారత ఆర్థిక వ్యవస్థ మొత్తంపైనే ఉండనుంది. రెమిటెన్స్ అంటే ఒక వ్యక్తి విదేశంలో పని చేసి, అక్కడి నుంచి తన స్వదేశంలోని కుటుంబానికి లేదా ఖాతాకు డబ్బు పంపడం. 2023-24లో భారత్‌కు వచ్చిన మొత్తం రెమిటెన్స్ 135.46 బిలియన్ డాలర్లు.

అందులో 32 బిలియన్ డాలర్లు అమెరికా నుంచే వచ్చింది. అయితే 11శాతం పన్ను విధానం వల్ల 10%-15% తగ్గుదల నమోదయ్యే అవకాశం ఉంది. అంటే.. 12-18 బిలియన్ డాలర్ల వరకు నష్టం జరగవచ్చు. రెమిటెన్స్‌లు భారతదేశానికి విదేశీ కరెన్సీ ప్రవాహంలో ప్రధాన భాగం. ఫస్ట్ విదేశీ మారక నిల్వలపై ప్రభావం పడుతుంది. ఆ తర్వాత కుటుంబ అవసరాలపై ఎఫెక్ట్, చివరికి డిపాజిట్లు తగ్గి బ్యాంకింగ్ వ్యవస్థపై ఎఫెక్ట్ చూపుతుంది.. ఈ బిల్లుపై అటు డెమొక్రాట్లు, సామాజిక కార్యకర్తలు, ఎలాన్ మస్క్ వంటి వాళ్లు మండిపడుతున్నారు. ఇదెక్కడి దిక్కుమాలిన రూల్స్ అంటున్నారు. ఈ బిల్లు సంపన్నులకు లాభం, సామాన్యులకు నష్టం అని కౌంటర్లు వేస్తున్నారు. అమెరికాను దివాళా తీయించే చట్టం ఇది అని అన్నాడు. రిపబ్లికన్లకు పొలిటికల్ సూసైడ్ అన్నాడు. అమెరికాలో కొత్త పార్టీకి కూడా సై అన్నాడు మస్క్. అద్భుతమైన బిల్లు అంటున్న ట్రంప్. మరోవైపు ట్రంప్ మాత్రం మస్క్ విమర్శలను సింపుల్ గా తీసుకున్నాడు. ఈ బిల్లు అద్భుతమైందంటూ చెప్పుకున్నాడు. ఆర్థిక వృద్ధిని పెంచు తుందంటూ కొత్త లెక్కలు చెబుతున్నాడు ట్రంప్. మరి ఈ చట్టం రిపబ్లికన్లకు నిజంగానే శాపంగా మారుతుందా.. వచ్చే ఎన్నికల్లో ఎఫెక్ట్ చూపుతుందా అన్నది చర్చనీయాంశంగా మారింది.

## మూడు జిల్లాల్లో

# తెలుగు తమ్ముళ్ల డిష్యూం.. డిష్యూం...



**కర్నూలు - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు నడుస్తుంది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పార్టీ అధినేతగా పార్టీని 2029 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తేవాలని భావిస్తుంటే నేతలు మాత్రం విభేదాలతో వెనక్కు లాగుతున్నట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు గ్రూపులతో కొట్లాడుకు కుంటున్నారు. బాహాబాహీకి దిగుతున్నారు. ఇది ఏ ఒక్క ప్రాంతానికో పరిమితమయితే దానిని సర్దుబాటు చేయవచ్చు. కానీ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చంద్రబాబు నాయుడు, లోకేశ్ మాటలను కూడా బేఖాతరు చేస్తూ కొందరు నేతలు వ్యవహరిస్తున్న తీరు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. ఇలాగే కొనసాగితే 2029 ఎన్నికల్లో గెలుపు సంగతి పక్కన పెడితే ఎన్నిసీట్లు వస్తాయన్నది కష్టమేనని టీడీపీ సోషల్ మీడియాలోనే కామెంట్స్ వినపడుతున్నాయి.

నంద్యాల జిల్లాలో డిష్యూం.. డిష్యూం... నంద్యాల జిల్లాలో పరిస్థితి తీసుకుంటే అక్కడ పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరికి, ఎమ్మెల్యేలకు పొసగడం లేదు. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి సమాచారం లేకుండా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమా నికి ఆ నియోజకవర్గానికి రావడంతో బుడ్డా అనుచరులను ఆమెను అడ్డుకున్నారు. మరొక వైపు ఏరాసు ప్రతాప్ రెడ్డి ఇంటిపై కూడా దాడికి దిగారు. తాము సమాచారం ఇచ్చినా బుడ్డా రాజశేఖర్ రెడ్డి కార్యక్రమానికి హాజరు కాలేదని బైరెడ్డి అనుచరులు చెబుతున్నప్పటికీ ఈ గ్యాప్ మరింత పెరిగేదిగానే ఉంది. కేవలం బుడ్డాతో మాత్రమే కాదు.. బైరెడ్డి శబరికి మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా సఖ్యత లేదని తెలుసుకున్న అధినాయకత్వం ఆమెను అమరావతికి పిలిపించింది. మహానాడును కడప జిల్లాలో పెట్టి పదికి పది పదిస్థానాలను కైవసం చేసుకోవాలని చంద్రబాబు పిలుపు నిస్తే పులివెందుల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ ఇన్ ఛార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి మధ్య విభే దాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇద్దరి మధ్య అధికారులు, కార్యకర్తలు నలిగిపోతున్నారు. మరొక వైపు కడప నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవి రెడ్డికి, పట్టణ పార్టీ అధ్యక్షుడికి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇక ప్రొద్దుటూరులోనూ అంతే. కమలాపురం నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. ఇక అనంతపురం పట్టణ నియోజకవర్గంలో టీడీపీ ద్వితీయ శ్రేణి నేతను హత్యకు ప్లాన్ ఎమ్మెల్యే అనుచరులు ప్లాన్ చేశారన్న ఆరోపణలతో కొంత పార్టీ ఇబ్బంది పడింది. ఇక కళ్యాణదుర్గం నియోజకవర్గంలో స్టాంపుల కుంభకోణంలో అమిలినేని సురేంద్ర బాబుపై ఆరోపణలు రావడం వెనక టీడీపీ నేత ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు ఉన్నం మారుతి ఉన్నారన్న విషయం తేలింది. చిత్తూరు జిల్లాలోనూ ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. చిత్తూరు జిల్లాలో కూడా అనేక నియోజకవర్గాల్లో నేతలకు, ద్వితీయ శ్రేణి నేతలకు మధ్య పొసగడం లేదు. గ్యాప్ ఎంతగా పెరిగిందంటే గత నాలుగు రోజులుగా జరుగుతున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలతో ఎవరూ పాల్గొనకపోవడం దీనికి అద్దం పడుతుందని అంటున్నారు. మొత్తం మీద తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సీరియస్ గా తీసుకుంటే తప్ప ఈ విభేదాలు పరిష్కారం అయ్యే సూచనలు కనిపించడం లేదు.

# ఇండోసోల్ వద్దు




**నెల్లూరు - సూర్య వాస్తవం**

కందుకూరు, సింగరాయకొండ సమీపం లోని కరేడు గ్రామం మండుతోంది. సారవంతమైన భూములు ఒక కంపెనీ కి కట్టబెడతామంటే ఊరుకోబో మంటూ అక్కడి రైతులు రోడ్డెక్కారు. బంగారం పండే తమ భూములను వదిలి తామెక్కడకి పోవాలనేది వారి ప్రశ్న. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతి రేకంగా ఆక్కడి ప్రజలు ఇటీవల హైవే దిగ్బంధం చేయడంతో విషయం వెలుగులోనికి వచ్చింది. అక్కడి రైతులకు అన్యాయం జరుగుతోంది అంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల, పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ ఆరోపిస్తున్నారు" కరేడు" గ్రామం ఉమ్మడి నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది.

పలువురు ఎనలిస్ట్‌లు, గ్రామ ప్రజలు చెబుతున్న దాని ప్రకారం గత వైసీపీ హయాంలో ఇండిసోల్ అనే కంపెనీ కోసం పీవీ మాడ్యూల్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి 5000 ఎకరాల భూమిని రామాయపట్నం పోర్టు సమీపంలో కేటాయించింది. అది జగన్ మోహన్ రెడ్డి సన్నిహితుల కంపెనీ అని ప్రజలకు రైతులకు అన్యాయం చేసి భూమిని అప్పజెబుతున్నారు అంటూ వామపక్షాలు, ప్రజలు ఆరోపించారు. 2024 ఎన్నికల ముందు ఆ భూ కేటా యింపులను మరింత పెంచారు. యువగళం పాదయాత్రలో భాగంగా పర్యటనకు వచ్చిన లోకేష్ ఆ సంస్థ జగన్ సన్నిహితులదే అని విమర్శలు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆ భూసేకరణ ఆపేస్తారని అను కున్నామని కానీ ఆలా జరగలేదని గ్రామస్తులు అంటున్నారు. రామాయపట్నం సమీపంలో జగన్ ప్రభుత్వం కేటాయించిన భూముల్ని బీపీసీయెల్ రిఫైనరీ కోసం వెనక్కి తీసుకున్నారు. దానికి బదులు 'కరేడు' గ్రామం దగ్గర 8000 ఎకరాలపైగా భూమిని ఇండో సోల్ కంపెనీకి కేటాయించడం వివాదాస్ప దమైందని అంటున్నారు.

వామపక్షాల నేతలు. "అప్పుడు జగన్, ఇప్పుడు కూటమి కేటాయించిన భూములు అత్యంత విలువైనవని చెబుతున్నారు రైతులు. "రెండేసి పంటలు పండించే భూమి. కాస్త లోతుగా తవ్వితే చాలు నీరు పడే సారవంతమైన భూములు. ప్రైవేటు కంపెనీకి కేటా యించడం ఏంటి. ఇదే ప్రాంతంలో ఎన్నో అప్‌ల్యాండ్ లేదా డ్రైల్యాండ్‌ను పరిశ్రమకు కేటాయించాలి. తమ భూముల్ని మాత్రం వదిలేయాలి" అని కరేడు గ్రామస్తుడు వెంకటేశ్వర్లు అంటున్నారు. కరేడు గ్రామానికి చెందిన భూములు వదిలేయాలని నేషనల్ హైవేని దిగ్బంధించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ అధికారులు వచ్చి వారికి నచ్చజెప్పి తాత్కాలికంగా ఆందోళన అదుపు చేయగలిగారు. ప్రస్తుతానికి గ్రామ సభలు ఏర్పాటు చేసి అక్కడ రైతులు ప్రజలతో సంప్రదింపులు జరుపుతున్నారు. "ఈ భూ కేటాయింపు వల్ల అటు ఇటుగా పదివేల మందికిపైగానే ప్రభావితం అవుతారు. ముందస్తుగా 4వేల ఎకరాల సేకరణకు రాత్రికి రాత్రి నోటిఫికేషన్ ఇచ్చారు" అని ఉద్యమ నాయకుడు మిరియం శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇలా రాత్రికి రాత్రే నోటిఫికేషన్ ఇవ్వడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ భూ సేకరణపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే తమ ఆందోళనను ఉద్ధృతం చేస్తామని రైతులు హెచ్చ రిస్తున్నారు. ఈ ఆందోళన ప్రభావం కందుకూరు నియోజక`వర్గంతో పాటు కొండేపి,కావలి లాంటి కీలక నియోజకవర్గాల పైనా పడే అవకాశం ఉందని ఎనలిస్ట్‌లు అంటున్నారు. అప్పట్లో భూకేటాయింపులు చేసిన వైసిపిగానీ, ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళుతున్న కూటమిగాని ఈ వివాదంపై నోరుమెదకపోవడం ఏంటని వైఎస్ షర్మిల, రామచంద్ర యాదవ్ లాంటి రాజకీయవేత్తలు విమర్శలు చేస్తున్నారు.

# రేషన్ పంపిణీలో కొత్త టెక్నాలజీ

**విశాఖపట్టణం - సూర్య వాస్తవం**

ఒకప్పుడు రేషన్ ఎలా తీసుకునే వాళ్లం, రేషన్ షాప్‌కు వెళ్లి మన దగ్గర ఉన్నరేషన్ కార్డుతో మ్యాన్‌వల్‌గా రాయించుకొని రేషన్ తీసుకునేవాళ్లాం. ఆ తర్వాత అందు బాటులోకి వచ్చిన ఈ పాస్ యంత్రాల ద్వారా ఫింగర్ ప్రింట్ లేదా, ఐరిస్ స్కాన్ ద్వారా ఇప్పుడు రేషన్ తీసుకుంటున్నాం. అయితే ఈ యంత్రాల్లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గమనించిన ప్రభుత్వం రేషన్ సేకరణ విధానాన్ని మరింత సులబతరం చేసేందుకు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. అదే ఫేస్ అథంటికేషన్?. దీని ద్వారా మనం ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఒక్క ఫోటో దిగితే చాలు రేషన్ పొందవచ్చు. ప్రస్తుతం ఈ కొత్త టెక్నాలజీని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం విజయవంతంగా అమలు చేస్తోంది.పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ కింద అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయడానికి రాష్ట్రంలోని డిజిటల్ టెక్నాలజీ, గవర్నెన్స్ విభాగాన్ని ఈ నెల 1 తేదీ నుంచి ఆధార్ ఆధారిత ఫేస్ అథంటికేషన్ వ్యవస్థను ప్రారంభించింది. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా రేషన్ దుకాణాల్లో వినియోగదారుల ఫేస్‌ను స్కాన్ చేసి వారికి రేషన్ సరుకులను అధికారులు అందజుస్తున్నారు. ఈ ఫేస్ అథంటికేషన్? వ్యవస్థను విజయవంతంగా అమలు చేస్తున్న దేశంలో మొదటి రాష్ట్రంగా ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్? నిలిచింది.అయితే హిమాచల్ ప్రదేశ్‌లోనూ ఇప్పటి వరకు అన్ని రాష్ట్రాల్లో లాగా ఈ పాస్ యంత్రం ద్వారానే రేషన్ పంపిణీ ప్రక్రియ కొనసాగేది. కానీ ఈ యంత్రాల్లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా ప్రజలు గంటల తరబడి రేషన్ షాప్‌ల వద్దే వేచి చూసే పరిస్థితి వచ్చింది. దీంతో పౌరసరఫరాల శాఖకు ప్రజలు నుంచి ఫిర్యాదులు రావడం పెరిగాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈ సమస్యపై దృష్టిపెట్టిన ప్రభుత్వం.. వాటిని అదిగమించేందుకు ఈ ఫేస్ అథంటికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త టెక్నాలజీని మొదటగా బిలాస్‌పూర్‌లో ప్రభుత్వం ట్రయల్‌రన్ నిర్వ హించింది. అది సక్సెస్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణ యించింది. ఈ మేరకు అన్ని జిల్లాల జిల్లా ఫుడ్ కంట్రోలర్లకు ఈ కొత్త టెక్నాలజీని అములు చేయాలని ఆదేశాలను జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక రేషన్ దుకాణాలలో ఈ టెక్నాలజీని వినియోగించే రేషన్ డీలర్స్ ప్రజలకు రేషన్ పంపిణీ చేస్తున్నారుఈ ఫేస్ అథంటికేషన్ కూడా సేమ్ మన బయోమెట్రిక్ లానే పని చేస్తుంది. ఈ పాస్ యంత్రం లో మన ఫింగర్ ప్రింట్ నమోదు చేసిన వెంటనే ఎలాగైతే మన వివరాలు వస్తాయో.. ఈ ఫేస్ అథంటి కేషన్‌లో కూడా.. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా మన ముఖాన్ని స్కాన్ చేసిన వెంటనే, ఈ పాప్ యంత్రంలో వినియోగ దారుల రేషన్ కార్డులో నమోదు అయి ఉన్న కుటుంబసభ్యులందరి పూర్తి వివరాలు వస్తాయి. అందులో మన పేరుపై క్లిక్ చేసి రేషన్‌ను మనం పొందవచ్చు. అయితే ఇందుకు రేషన్ కార్డుకు కచ్చితంగా మన ఆధార్ లింక్ చేసి ఉండాలి.ఈ కొత్త టెక్నాలజీపై ప్రిన్సిపల్ అడ్వైజర్ గోకుల్ బుటెల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈపాస్ యంత్రం ద్వారా బయోమెట్రిక్ మ్యాచింగ్ వైఫల్య సమస్యలు ఎదుర్కొన్నామని.. వాటిని అదిగ మిం చేందుకే ఈ ఫేస్ అథంటిఫికేషన్ వ్యవస్థను తీసుకొచ్చినట్టు తెలిపారు. రేషన్ డీలర్ స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసిన కెమెరాతో ముఖాన్ని స్కాన్ చేసి లబ్ధిదారుడిని గుర్తించవచ్చని ఆయన తెలిపారు. ఇందుకు కోసం సురక్షితమైన మొబైల్ అప్లికేషన్‌ను వినియోగిస్తున్నా మని.. ఇది నెట్‌వర్క్ కనెక్టివిటీ లేదా బయోమెట్రిక్ హార్డ్‌వేర్‌పై ఆధారపడదని ఆయన తెలిపారు.



# రైతులకు ఉచితంగా డ్రిప్ ఇవ్వాలి : సీపీఐ




**రాప్తాడు – సూర్య వాస్తవం, జూలై 7:** రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోందని సిపిఐ పార్టీ మండలం కార్యదర్శి ఆర్ రవీంద్ర పేర్కొన్నారు. రాప్తాడు మండల పరిధిలోని భోగినేపల్లి రామినేపల్లి గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి గ్రామ స్థాయి నుండి దేశ స్థాయి వరకు గ్రామాల్లో శాఖ మహాసభలను నిర్వహిస్తున్నాము అని అన్నారు. చిన్న సన్న కారు రైతులకు డ్రిప్ పరికరాలను జీఎస్టీ లేకుండా ఇవ్వాలి. ప్రతి రైతుకు సబ్సిడీతో ట్రాక్టర్ తో పాటు ఇతర వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి అని అన్నారు. కుటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటిన ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు? ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ శాఖ గ్రామల కార్యదర్శులు పెద్దన్న పెద్దిరాజు, మారెన్న, మమత, నాగేంద్రమ్మ, నాగన్న, గాయత్రి, నరసింహా, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# వీరపు నాయునిపల్లె భాగవత సప్తాహంలో తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం, జూలై 7:** సోమవారం వీరపు నాయిని పల్లె మండలం సంగాల పల్లె శివకృష్ణ గోశాల ప్రాంగణంలో భాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్య సభ మాజీ సభ్యులు,ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ భాగవత సప్తాహం మోక్ష ప్రాప్తికి మార్గం అన్నారు. ఆధునిక మానవుడు అన్నీ ఉండీ కూడా అశాంతితో అలమటిస్తున్నా డన్నారు. ఈ పరిస్థితిలో భాగవత సప్తాహం లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవునికి ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. శ్రీమన్నారాయణుని అవతార లీలా గాదా వైభవమే శ్రీమద్ భాగవతం అన్నారు. ప్రహ్లాదుడు, ధ్రువుడు, అంబరీషుడు, ముచికుందుడు తదితర భక్తుల గాథల ద్వారా ఆధ్యాత్మిక నాన్ని ప్రసాదించే మోక్ష శాస్త్రమే భాగవతం అని వివరించారు. ఈ కార్యక్రమం లో కల్లూరు రాజ శేఖర్ రెడ్డి దంపతులు, భద్రంపల్లి చెన్న కృష్ణా రెడ్డి, రామాంజ నేయ రెడ్డి నర్రెడ్డి సదాశివా రెడ్డి తదితర భాగవతులు పాల్గొన్నారు.

# పోలీసుల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వినతులు



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూలై 7:** అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నాడు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో 68 పిటీషన్లు స్వీకరించారు. జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రతీ పిటీషనర్ తో మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా మాట్లాడారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి పిటీషన్లకు పరిష్కారం చూపాలని సూచించారు. పోలీస్ గ్రీవెన్స్ కార్యక్రమంలో భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై బాధితులు తమ నినతులు అందజేశారు.

# వానలు కురవాలని వలస వెళ్లిన గ్రామస్తులు



**శాంతిపురం – సూర్య వాస్తవం, జూలై 7:** మండల పరిధిలోని కర్లఘట్ట గ్రామంలో వర్షాలు బాగా కురవాలని పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఆ గ్రామంలోని ప్రజలంతా ఊరి బయట వలస వెళ్లి పూజలు చేస్తారు. ఈ పూజల కోసం భాజా భజంత్రీలతో, బాణసంచా కాలుస్తూ కోలాహలంగా ఊరి బయటకు వెళ్తారు అంతకు మునుపు ఊరిలో ఎవరు ఉండకూడదంటూ టముకు వేసి ముందుగా గ్రామ ప్రజలందరికీ తెలియజేస్తారు. పుష్కరానికి ఒకసారి జరిపే ఈ పూజలలో గ్రామ ప్రజలు తమ ఇళ్లను ఉదయమే ఖాళీ చేసేస్తారు. అనంతరం గ్రామ పొలిమేరల్లోని చెరువుల వద్ద ఊరి పెద్దలతో కలిసి సత్యదేవతలకు పూజలు చేస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే పిండి వంటలు వండి అందరికీ భోజనాలు పెడతారు. వివిధ రకాలైన మొక్కలు చెల్లించుకుని సాయంత్రం పొద్దుపోయాక గ్రామానికి వస్తారు. ఇది ఆనవాయితీగా ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి ఆ గ్రామంలో జరిగే క్రతువు. ఈ క్రతువులో ఏ ఒక్కరూ ఇంటి వద్ద ఉండక పోవడం విశేషం. ఈ పూజల ద్వారా తమ ప్రాంతంలో వర్షాలు బాగా కురుస్తాయని కర్లగట్ట పరిసర ప్రాంతాలలోని ప్రజలు నమ్మకంతో ఉంటారు. కర్లఘట్ట గ్రామ పరిసర ప్రాంతంలోని చిన్నకర్లగట్ట, ప్రీతిచామనూరు, తమ్మిగానిపల్లి 72 సొన్నేగాని పల్లి, కాళిగానూరు, గ్రామాలలోని ప్రజలు పూజలో పాల్గొన్నారు.

# ఇంటింటికీ పథకాలు ఇస్తున్న తెలుగుదేశం ప్రభుత్వం

## - అందుకే ఏడాది పాలనపై ఎటు చూసినా హర్షం వ్యక్తమవుతోంది
## - సుపరిపాలన తొలి అడుగులో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూలై 7:** అనంతపురం జిల్లాను ఆటోమొబైల్, సోలార్ హబ్ గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని 19 వ డివిజన్ సాయి నగర్ లో ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు – ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్తూ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా చోట్ల ఒకటవ తేదీ పింఛన్ ఇంటికి వచ్చి అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తల్లికి వందనం ఇంట్లో ఉన్న అందరి పిల్లలకి వచ్చిందని కొందరు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. మరికొన్ని చోట్ల ఎమ్మెల్యే దగ్గుపాటికి కొన్ని విజ్ఞప్తులు కూడా చేశారు. సూర్య నగర్ కాలనీవాసులు మరువ వంక వలన ఇబ్బందులు పడుతున్నామని భారీ వర్షాలు వచ్చిన సమయంలో కాలనీలోకి నీరు వస్తోందని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ నడిమి వంక, మరువంక ప్రొటెక్షన్ వాల్ నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని త్వరలోనే పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. మరికొన్నిచోట్ల ఇంటి పట్టాలు, ఇళ్ల నిర్మాణాల గురించి విజ్ఞప్తులు చేయగా ఇవి కూడా ఈ ఏడాదిలోనే మొదలవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఏడాది కాలంలోనే కీలకమైన హామీలన్నీ నెరవేర్చి ప్రజల్లోకి వచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు. మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాల మీద ప్రత్యేకించి హర్షం వ్యక్తమవుతోందన్నారు. తొలి ఏడాదిలోనే 9.50 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు, 8.50 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా కల్పించారన్నారు. గతంలో అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమను తీసుకురావడం వలన 35వేల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. తాజాగా మరికొన్ని ఆటోమొబైల్ పరిశ్రమలు తీసుకొస్తున్నారని, సోలార్ ఇండస్ట్రీస్ కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయని అన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలోనే అమరావతి, పోలవరం నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో కార్యక్రమాలు చేసినా చెప్పుకోలేకపోయామన్నారు. ఈసారి చేసిన వాటి గురించి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళు న్నామన్నారు. ఇంకా నాలుగు ఏళ్లలో చేయాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయని ప్రజల నుంచి పూర్తి సహకారం అవసరమని ఎమ్మెల్యే దగ్గుపాటి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ కార్పొరేటర్ బాలాంజనేయులు, డివిజన్ నాయకులు లక్ష్మీదేవమ్మ, ఓబుల్ రెడ్డి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జె ఎల్ మురళీధర్, రాయల్ మురళి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగవరం రవి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ గ్రంథాలయ చైర్మన్ గౌస్ మోద్దిన్, కార్పొరేషన్ డైరెక్టర్లు పరమేశ్వర్, కొండన్న, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, టిడిపి సీనియర్ నాయకుడు నాగన్న, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కృష్ణకుమార్, టిఎన్ టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వెంకటేష్, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంఘ తేజస్విని, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నాగభూషణం, టిఎన్టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మోహన్ కుమార్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు, బీసీ సెల్ నగర అధ్యక్షుడు గోపాల్ గౌడ్, ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు మనోహర్, మాజీ కార్పొరేటర్లు సరళ, మల్లెల దుర్గేష్, టిడిపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, డిష్ ప్రకాష్, దాడి మల్లికార్జున, సరిపోటి శ్రీకాంత్, రమాదేవి, వడ్డే భవాని, అయేషా, మణి రవి, గోళ్ళ సుధాకర్ నాయుడు, సుంకన్న, శ్రీనివాస్ గౌడ్, ఈడిగ నాగభూషణం, బెస్త పవన్ కుమార్, గంగవరం అంజి టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంట్లో ఒక ఎంటర్ ప్రెన్యూర్ ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం

## - అందుకనుగుణంగానే జేఎన్టీయూలో రతన్ టాటా ఇన్నోవేషన్ స్పోక్
## - జేఎన్టీయూ వీసీ సుదర్శన్ రావుతో సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూలై 7:** ప్రతి ఇంట్లో ఒక ఎంటర్ ప్రెన్యూర్ ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా అనంతపురం జేఎన్టీయూలో ఏర్పాటు కాబోతున్న స్పోక్ సెంటర్ పై ఆయన వీసీ సుదర్శన్ రావ్ తో సమావేశమయ్యారు. అనంతపురం ఆర్.అండ్.బి అతిథి గృహంలో వీసీతో స్పోక్ కు సంబంధించిన అంశాల గురించి చర్చించారు. ఇప్పటికే స్పోక్‌కు ప్రభుత్వం 30 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసింది. సెంటర్ ఏర్పాటుపై ఎమ్మెల్యే దగ్గుపాటి చర్చించారు. ప్రధానంగా ఎక్కువ మంది యువతకు అవకాశం కల్పించే విధంగా ఈ సెంటర్ ఉండాలని ఆయన జేఎన్టీయూ వీసీని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2047 లో భాగంగా అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతపురం జేఎన్టీయూలో ఒక స్పోక్‌ను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్‌ల ప్రోత్సాహం కోసం ఈ స్పోక్ ఒక కేంద్రంగా పనిచేయనుందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం వంటివి జరుగుతాయన్నారు. ఈ ప్రాజెక్టులో గ్రీన్‌కో ఎనర్జీ, అవంతి గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు గవర్నింగ్ కమిటీలో భాగస్వాములుగా ఉన్నాయన్నారు. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అత్యంత కరువు జిల్లాగా ఉన్న అనంతపురంలో ఈ కేంద్రం ఏర్పాటు కావడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే దీని కార్యకలాపాలు కూడా ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# సుపరిపాలనలో తొలి అడుగులో ఇంటింటికి తెలుగుదేశం


## - టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కుప్పం పరిశీలకులు రాజుల ఖాదర్ బాషా



**రాయచోటి – సూర్య వాస్తవం, జులై 7:** రాయచోటి మున్సిపాలిటీ 98, 101 భూత్‌లో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించడం జరిగిందని రాష్ట్ర టిడిపి కార్యదర్శి కుప్పం నియోజకవర్గం పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా అన్నారు. సోమవారం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో రామాపురం, చౌడమ్మ గుడి ప్రాంతంలో ఆయన తెలుగు దేశం పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం చేపట్టిన ప్రతి పని భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి వివరించి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. 101వ బూతులో ప్రజలు నీటి సౌకర్యము, రోడ్లు తెలుగుదేశం ప్రభుత్వంలో వేశారని గత వైసీపీ ప్రభుత్వంలో ఎప్పుడు వైసిపి నాయకులు ఇంటి దగ్గరకు వచ్చిన దాఖలాలు లేవని మంత్రి రాంప్రసాద్ రెడ్డి రెండు పర్యాయాలు ఇంటి వద్ద కు కూడా వచ్చారని మా కష్టాలు విని సమస్యలు కూడా పరిష్కరించారని తెలిపారు. ప్రతి ఇంటిలో కూడా చంద్రబాబు నాయుడుకు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజలు ఇది మంచి ప్రభుత్వమని చెడు ప్రభుత్వం వెళ్లిపోయిందని ఇక ఎప్పటికీ మాకు మంచి రోజులే ఉంటాయని చెబుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూత్ ఇన్చార్జీలు వీరబల్లి మల్లికార్జున తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకావిష్కరణకు

## విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఆహ్వానం



**కదిరి - సూర్య వాస్తవం, జూలై 07:** భారతీయ ముస్లిం లెజెండ్స్ భారతదేశ నిర్మాణంలో ముస్లిం దేశ భక్తుల పాత్ర పుస్తకావిష్కరణ కొరకు విశ్రాంత భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ్‌ని బెంగళూరు సహకారనగర్ స్వగృహంలో పుస్తక రచయిత కల్లూరు ఉమర్ ఫారూఖ్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విశ్రాంత భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ్ ఖచ్చితంగా వస్తానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ జూలై 20 వ తేదీ హిందూపురం బాలాజీ టాకీస్ రోడ్ సెవెన్‌స్టార్‌లో జరిగే ఈ కార్యక్రమానికి రెండు రాష్ట్రాల కవులు రచయితలు తెలుగు భాషాభిమానులు తరలివస్తున్నారని, భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, శ్రీ సత్యసాయి జిల్లా రచయితల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగు భాషాభిమానులకు ఉమర్ ఫారూఖ్ ఖాన్ విజ్ఞప్తి చేశారు.

## కుప్పం నుంచి విజయవాడకు వందే భారత్ రైలు కోసం వినతి



**కుప్పం - సూర్య వాస్తవం, జూలై 07:** బెంగళూరు నుండి విజయవాడకు కుప్పం మీదుగా వందే భారత్ రైలు ఏర్పాటు చేయాలని కుప్పం బిజెపి ఇంచార్జి తులసి నాథ్ రైల్వే ఏజీఎం కె.ఎస్ జైన్ ను కోరారు. సోమవారం కుప్పం రైల్వే స్టేషన్ ను తనిఖీ చేసేందుకు వచ్చిన రైల్వే ఏజీఎంను కలిసి పలు రైల్వే సమస్యలను తులసినాథ్ వివరించారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం మీదుగా విజయవాడకు వందే భారత్ రైలు ను ఏర్పాటు చేయాలని కోరారు. కుప్పం నుంచి విజయవాడకు వెళ్లేందుకు ప్రజలకు ఎంతో సౌకర్యం ఉంటుందని రైల్వే ఏజీఎం కోరగా సానుకూలంగా స్పందించినట్లు తులసినాథ్ తెలిపారు.

## సుపరిపాలనకు మొదటి అడుగు విజయమే లక్ష్యం

**- కె.ఆర్ ట్రస్ట్ అధినేత కళ్యాణ్ రెడ్డి**



**తిరుపతి జిల్లా, పెళ్లకూరు - సూర్య వాస్తవం, జూలై 07:** పెళ్లకూరు మండలంలో మంగళవారం జరగనున్న "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం విజయవంతం చేయాలని టిడిపి యువ నాయకుడు, కె.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వేలూరు కళ్యాణ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుండగా, తాల్వాయిపాడు, కానూరు రాజుపాలెం, శిరసనం బేడు, చావాలి వంటి గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు గ్రామస్థాయి నాయకులతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశామని కళ్యాణ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం టిడిపి ప్రభుత్వ పాలనలో ఒక సంవత్సరం పూర్తి చేసిన వేళ ప్రజలకు చేరువయ్యే మలుపుగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## లారీని ఢీకొన్న కారు

**- ఎయిర్ బెలూన్ తెరచి తప్పిన ప్రాణాపాయం**
**- సంఘటనా స్థలానికి చేరుకున్న ఛైర్మన్ ప్రసాద్ నాయుడు**
**- గాయపడిన వారికి ఆసుపత్రిలో చికిత్స...**
**- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**తిరుపతి జిల్లా, పెళ్లకూరు - సూర్య వాస్తవం, జూలై 07:** పెళ్లకూరు మండలంలోని టెంకాయతోపు ఫ్లైఓవర్ వద్ద ఆదివారం ఉదయం తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై నుంచి తిరుపతి జిల్లా అక్కగారిపేట గ్రామానికి వస్తున్న పసుపులేటి రవి, ఆయన భార్య లక్ష్మి ప్రయాణిస్తున్న కారు, ముందుగా వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో అదుపుతప్పి ఢీకొట్టింది. కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమవ్వగా, సకాలంలో హెయిర్ బెలూన్ తెరచుకోవడంతో వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న స్వర్ణముఖి ఆయకట్టు ఛైర్మన్ దామెర్ల ప్రసాద్ నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అనంతరం వారిని శ్రీకాళహస్తిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు విచారణ ప్రారంభించారు.

### వ్యవసాయ శాఖ

# ఖరీఫ్ బీమా పోస్టర్లు విడుదల



**రాయచోటి - సూర్య వాస్తవం, జులై 7:** వ్యవసాయ శాఖ ఖరీఫ్ 2025 పంటల భీమాకు సంబంధించిన గోల పత్రాలు, కరపత్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ల చేతిలో మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2025 గాను ( పి ఎమ్ ఎఫ్ బి వై) ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద వరి, కంది పంటలు మరియు (ఆర్ డబ్ల్యు బిసిఐఎస్) పునర్ వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద వేరుశెనగ, టొమోటో, అరటి పంటలు నోటిఫై కాబడినవి. కావున రైతులు పంటల బీమా పథకం ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పంటల బీమా చేసుకోవడానికి వరి పంటకు ఎకరానికి 840 రూపాయలు, కంది పంటకు ఎకరానికి 300 రూపాయలు, వేరు శెనగ ఎకరానికి 560 రూపాయలు, టమోటా పంటకు 1600 రూపాయలు, అరటి పంటకు 3025 రూపాయల ప్రీమియం చెల్లించాలి. బ్యాంకులో పంట రుణం తీసుకున్న రైతులు విడిగా ప్రీమియం చెల్లించవలసిన అవసరం లేదు. బ్యాంకు లోను తీసుకోని రైతులు మీ సేవా కేంద్రములో ప్రీమియం చెల్లించాలి. పంటల బీమా పథకం పొందడానికి ప్రీమియం చెల్లించిన రైతులు బ్యాంకు రుణం పొందిన రైతులు ఖచ్చితంగా ఈ పంటలో నమోదు చేసుకోవాలి అని జిల్లా వ్యవసాయ అధికారి జి.శివన్నారాయణ తెలిపారు.

# భవిష్యత్ పాలనకు బలమైన అడుగు

**- నేడు ఎమ్మెల్యే విజయశ్రీ పర్యటన**
**-సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటన షెడ్యూల్ విడుదల**




**పెళ్లకూరు-సూర్య వాస్తవం, జూలై 07:** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పురస్కరించుకుని పెళ్లకూరు నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఆమె పర్యటన షెడ్యూలు క్రింది విధంగా ప్రకటించారు: ఉదయం 8:00 గంటలకు తాళయపాడు ప్రాంతంలో పర్యటన, ఉదయం 10:00 గంటలకు పెన్నేపల్లి గ్రామ సందర్శన, ఉదయం 11:00 గంటలకు ఎగువ కానూరు గ్రామ పర్యటన, మధ్యాహ్నం 4:00 గంటలకు చావాలి చెక్ పోస్ట్ సందర్శన సాయంత్రం 5:00 గంటలకు శిరసనంబేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఈ కార్యక్రమాల్లో తెలుగు దేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంబంధిత శాఖాధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొనాలని మండల టీడీపీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య పిలుపునిచ్చారు.

### బడుగు బలహీన వర్గాల

# ఆశయ సాధనకు కూటమి ప్రభుత్వం అండ..

**- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం - సూర్యవాస్తవం, జూలై 07:** పేదరి కంలేని నవసమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమనీ ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాయదుర్గం మండలం చదం గొల్లల దొడ్డిలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఆయన తనయుడు, యువ నేత కాలవ భరత్ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయక ˘త్వంలోని కుటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ఆర్థిక సాయం గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్నా తమకు అందలేదని కొందరు అసహాయత వ్యక్తపరిచారు. అందుకు కారణాలపై సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాలతో ఆగిపోయిన వారికి సమస్యను వివరించటంతో పాటు వీలైనంత త్వరగా లబ్ధి చేకూరేల చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కురుబ హనుమంతు, మల్లేశప్ప, సోము, విజయ కుమార్, కాటా వెంకటేశులు, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.



# భారీగా గంజాయి పట్టివేత



**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూలై 7:** కర్ణాటక నుండి అక్రమంగా గంజాయ్ తరలిస్తున్న ముఠాను కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆదేశాలతో ఈ ముఠాను రాయదుర్గం సి.ఐ బృందం సోమవారం నాడు అరెస్టు చేశారు.దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 1,709 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని 10 మంది గంజాయి ముఠా అరెస్టు చేసి వారి నుంచి 7 సెల్ ఫోన్లు సీజ్ చేశారు. వీరంతా కర్నాటక నుండీ అక్రమంగా తరలించి రాయదుర్గం ప్రాంతంలో విక్రయి స్తుంటారని తెలిపారు.

**నిందితుల వివరాలు :**

1. బోయ నరేష్, వయస్సు 24 సంవత్సరాలు, కర్తనపర్తి గ్రామం, కంబదూరు మండలం. 2. కొడపల్లి రామాంజినేయులు అలియాస్ డేలార్ రామాంజినేయులు, వయస్సు 50 సంవత్సరాలు, కొత్తూరు గ్రామం, కంబదూరు మండలం. 3. యెరుకల మారెన్న, వయస్సు 40 సంవత్సరాలు, చెన్నంపల్లి గ్రామం, కంబదూరు మండలం. 4. మాదిగుబ్బ చిటమ్మరప్ప, వయస్సు 62 సంవత్సరాలు, తోపుదుర్తి గ్రామం, ఆత్మకూర్ మండలం. 5. కంటగాని వెంకటరాముడు, వయస్సు 42 సంవత్సరాలు, పూలకుంట గ్రామం, అనంతపురం రూరల్ మండలం. 6. దంపట్ల జీవన్ కుమార్, వయస్సు 20 సంవ త్సరాలు, చంద్ర బాబు కొట్టాల, అనంతపురం పట్టణం. 7. బండి ఉదయ్ కిరణ్ అలియాస్ బన్ని, వయస్సు 21 సంవత్సరాలు, రుద్రంపేట, అనంతపురం పట్టణం. 8. అంచెల రసూల్ ఖాన్, వయస్సు 50 సంవత్సరాలు, పాతకల్లు గ్రామం, గార్లదిన్నె మండలం. 9. ఇమామ్ సాబ్ అలియాస్ గిరి, వయస్సు 55 సంవత్సరాలు, ఎన్ టి కాలనీ, అనంతపురం పట్టణం. 10 షేక్ అన్వర్ బాషా, వయస్సు 55 సంవత్సరాలు, రాణి నగర్, అనంతపురం పట్టణం.

**ముఠా నేపథ్యం :** జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వీరంతా ముఠాగా ఏర్పడి సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి విక్రయం జోలికెళ్లారు. కర్నాటకలోని బళ్లారి నుండీ అక్రమంగా తీసుకొచ్చి రాయదుర్గం, కళ్యాణదుర్గం, తదితర ఏరియాలలో విక్రయించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. బళ్లారిలోని రైల్వే స్టేషన్, బస్టాండు ప్రాంతాలలో ఉన్న సాధువులు దగ్గర కిలో 25 వేలు ప్రకారం కొనుగోలు చేసి అక్కడి నుండీ రైలు మార్గం ద్వారా జిల్లాలోకి తీసుకొస్తున్నారు. ఇక్కడికొచ్చాక చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చుకుని ఒక్కో ప్యాకెట్ రూ. 800 ప్రకారం విక్రయిస్తున్నారు. వచ్చిన సొమ్మును వాటాలుగా పంచుకుంటున్నారు.

**గంజాయిపై ప్రత్యేక నిఘా :** ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న గంజాయిపై రాయదుర్గం పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆదేశాల మేరకు రాయదుర్గం సి.ఐ జయనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిఘా వేశారు. కనేకల్ రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాలు, బయలు ప్రదేశాలు తనిఖీలు చేస్తుండగా రైల్వే బ్రిడ్జి వద్ద 1.709 గ్రాముల గంజాయి తరలిస్తున్న ఈ ముఠాను అరెస్టు చేశారు.

# బాబూ! కడప జిల్లాపై అంత కక్ష ఎందుకు ?

**- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం భావ్యమా?**
**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి - సూర్య వాస్తవం, జూలై 7:** కడప జిల్లాపై కక్ష పెంచుకోవడం, విద్యార్థుల జీవితాలతో ఆడు కోవడం భావ్యం కాదని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి సూచించారు.రూ 670 కోట్ల తో నిర్మించిన పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభానికి నోచుకోలేదు.2024-25 విద్యా సంవత్సరానికి నేషనల్ మెడికల్ కమీషన్ 50 యంబిబిఎస్ సీట్లు మంజూరు చేయగా కూటమి ప్రభుత్వం వద్దని లేఖ రాసింది.2025-26 విద్యా సంవత్సరానికి ప్రయత్నమే చేయలేదు. 2020లో కడపలో ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ విశ్వ విద్యాలయం ప్రారంభమైంది. ఇంతవరకు డిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నుంచి అనుమతి రాలేదు.విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడింది.2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమే కాలేదు. గతంలో కడప జిల్లా నుంచి ముఖ్య మంత్రి,ఉప ముఖ్యమంత్రి ఉండే వారు.ఇప్పుడు కనీసం మంత్రి కూడా లేరు. పునరుద్ధరణ పనులు పూర్తి అయినప్పటికీ గండి వీరాంజనేయ స్వామి మూల విరాట్టు దర్శనం భక్తులకు లభించడంలేదు.

**కాంగ్రెస్ డిమాండ్లు:** 1.కడప ఆర్కిటెక్చర్ ఫైనార్ట్స్ విశ్వ విద్యాలయానికి డిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతి పొందాలి.2025-26 అడ్మిషన్ల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి.విశ్వ విద్యాలయానికి శాశ్వత భవనాలు నిర్మించాలి.2.పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల ను వెంటనే ప్రారంభించాలి.3.గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో మూల విరాట్టు దర్శనం భాగ్యం భక్తులకు వెంటనే కల్పించాలి. 4.మంత్రి వర్గంలో ఖాలీగా ఉన్న ఒక్క మంత్రి పదవిని కడప జిల్లా వారితో భర్తీ చేయాలన్నారు.

**జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి**

మాజీ ఉప ప్రధాని, ఏఐసీసీ మాజీ అధ్యక్షులు స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ 39 వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం వేంపల్లిలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ గొప్ప పరిపాలనా దక్షుడనీ,దేశ భక్తుడని,అసలు సిసలు గాంధేయవాది అని తులసి రెడ్డి కొని యాడారు. 40 సంవత్సరాలు యంపీగా, 30 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా ప్రపంచ రికార్డ్, జాతీయ రికార్డ్ నెలకొల్పారన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసర ణీయం, స్ఫూర్తి దాయకం, మార్గదర్శకం అన్నారు. ఈ వేమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రి నాథ్, రాఘవయ్య, వేమా రాజా, రాజు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని రద్దు చేయాలి

**- అన్నమయ్య డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్**



**రాయచోటి-సూర్య వాస్తవం, జులై 7:** స్మార్ట్ మీటర్లు రద్దుచేసి ప్రజలపై పడుతున్న విద్యుత్ భారాన్ని తగ్గించాలని డిసిసి చీఫ్ సెక్రెటరీ అమీర్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశా రు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణములోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో విలేకరులతో ఆయన మా ట్లాడు పేదలైన విద్యుత్ వినియో గదారులపై ఎక్కువ భారం మోపారు ఇది కుటుంబ ప్రభుత్వానికి తగద న్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు విద్యుత్ చార్జీల సర్దుబాటు పేరుతో 15.485 కోట్ల రూ పాయల ప్రజలపై భారం మోపారని ఆయన అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్ర బాబు విద్యుత్ పెంచమని స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పిన బాబు అధికారం వచ్చాక విద్యుత్ ఛార్జిలు పెంచడం ఏమిటిఅనిఅన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక నాలుగు సార్లు విద్యుత్ చార్జీలు రద్దుచేసి స్మార్ట్ మీటర్లు బిగించే విధా నాన్ని రద్దు చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు బాధ్యతగా పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**
**-అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించిన జిల్లా కలెక్టర్**



**రాయచోటి-సూర్యవాస్తవం, జూలై 07:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రజా విజ్ఞప్తులను నిశితంగా పరిశీలించి సమస్యలను ఎప్పటికప్పుడు బాధ్యతగా పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదే శించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రజా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అత్యంత ప్రాధాన్యతతోజవాబు దారితనంతో పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి అందిన ఫిర్యాదులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంపై సీఎంఓ కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా సమస్యలనుపరిష్కరించాలన్నారు. ప్రతి సమస్యకు సంబంధించిన పరిష్కారంతో పాటు ప్రజల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్‌ను కూడా ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలి స్తోందని, ఈ విషయాన్ని గుర్తెరిగి అధికారులందరూ ఫిర్యా దులను నూరు శాతం పరిష్కరించే దిశలో చర్యలు తీసు కోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే బియాండ్ ఎస్ఎల్ఏ ఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరిం చాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరిం చాలన్నవిషయాలపై అధికారులకు అవగాహన ఉం డాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరి ంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.



**అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించిన జిల్లా కలెక్టర్:** ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు:** వీరబల్లి మండలం మట్లి తోగటపల్లికు చెందిన గుండ్లపల్లి అనంతమ్మ తనకు 75 సంవత్సరాలని వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయవల సిందిగా కోరుతూ కలెక్టర్ కు దరఖాస్తునుసమర్పించుకున్నారు.రాయచోటి మండలం, ఎగువ అబ్బవరం వార్డు నెంబర్ 15, రాయుడు కాలనీలోని నగరిమడుగు మహేష్ మా హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ నందు ఇతరుల పేర్లు నమోదై ఉన్నాయని మా హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ నందు వారి పేర్లను తొలగించాలని కోరుతూ కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.రామాపురం మండలం, కసిరెడ్డి గారి పల్లి గ్రామపంచాయతీ లోని సూర్యనారాయణ పురం ( మేదరపల్లి)కు చెందిన ఆర్ల సుబ్బయ్య గత ప్రభుత్వంలో రైతు భరోసా పనులు చేయడం జరిగిందని వాటికి సంబంధించిన బిల్లులు అన్ని చెల్లించడం జరిగిందని, డిపాజిట్ డబ్బు మాత్రం ఇంతవరకు పడలేదని మంజూరు చేయవలసిందిగా కోరుతూ కలెక్టర్కుదరఖాస్తును సమర్పి ంచుకున్నారు. పెనకలూరు మండలం, నల్లపురెడ్డి గ్రామ పంచాయతీ, బెస్తపల్లి కు చెందిన ఎల్. నారాయణరెడ్డి జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా నిమ్మ చెట్లను మంజూరు చేయవలసిందిగా కోరుతూ కలెక్టర్‌కు దరఖాస్తును సమర్పిం చుకున్నారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డి ఆర్ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు








**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 7:** వారాం తపు సంస్కృతిక కార్య క్రమాల్లో భాగంగా అనం తపురం పట్టణంలోని స్థానిక శిల్పారామంలో శక్తి శారీ బ్యాగ్స్ వారి సహ కారంతో.. కౌసల్య బృందం చే సాంస్కృతిక కార్యక్రమాలు ...ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ దేవరకొండ వారి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆదివారం సాయంత్రం నుండి రాత్రి వరకు అలరించాయి. అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారికి అభినందనలు తెలిపారు.

# ఉన్నత అధికారులకు సన్మానం



**రాయదుర్గం- సూర్య వాస్తవం, జూలై 7:** రాయదుర్గం నియోజకవర్గంలోని పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాయదుర్గం పట్టణంలోని ఉన్నతాధికారులకు ఘనంగా రాయదుర్గం ఫాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు..రాయదుర్గం పట్టణంలోని అర్బన్ సీఐ జయ నాయక్, మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, తాసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో కొండయ్యలకు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉన్నతాధి కారులు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశములు దైవ సన్నిధిలో పనిచేస్తున్న పాస్టర్ల ల సేవ మరవరానిదని ప్రతి ఒక్కరూ పాస్టర్లను ఆదర్శంగా తీసుకొని దైవ సన్నిధిలో సమాజం కోసం దైవ సన్నిధిలో సమాజ అభివృద్ధికి పాటుపడాలని ఉన్నతాధికారులు పాస్టర్లకు సూచించారు.ప్రియమైనటువంటి దైవజనులకు మన ప్రభువును రక్షకుడైనటువంటి ఏసుక్రీస్తు ఉన్నతమైన నామమున అధికారులకు దైవజనులు పాస్టర్లు అధికారులకు శుభాభివందనాలు తెలిపారు.దేవుని విశ్వసించిన విశ్వాసులకు దైవ సేవ కులుగా సేవలందిస్తున్న పాస్టర్లకు సమస్యలు ఉన్నాయని ఆయా సంబంధిత అధికారులు సమ స్యలను పరిష్కరించాలని పాస్టర్లు కోరారు. క్రైస్తవ సమాధుల తోట, క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ గురించి చర్చి స్థలాలకు సంబంధించిన పొసిషన్ సర్టిఫికెట్ల గురించి చర్చించారు. ఈ ఆప్యాయత సన్మాన సమావేశంలో పాస్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పాస్టర్ జి. జయ చంద్రబాబు ,వైస్ ప్రెసిడెంట్, పాస్టర్ జె. కిరణ్ కుమార్, జనరల్ సెక్రటరీ, పాస్టర్ ప్రేమ్ కుమార్ , ట్రెజరర్జి,పాస్టర్ ఆనంద్ ,జాయింట్ ట్రెజరర్, పాస్టర్ పీటర్ ,రాయదుర్గం మండల కమిటీ సభ్యులు మండల ప్రెసిడెంట, పాస్టర్ డేవిడ్ వీరేష్, సెక్రటరీ పాస్టర్ యోసేపు,ట్రెజరర్ పాస్టర్ హనోకు పాస్టర్ శిరిగే దొడ్డి డేవిడ్ కేపీ దొడ్డి పాస్టర్ , మరికొందరు సహోదరులు పాల్గొన్నారు.



# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: సిఐటియు



**రాప్తాడు- సూర్య వాస్తవం,జూలై 07:** కార్మికులకు గుదిబండలా తయారవుతున్న లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి రామాంజనేయులు పేర్కొన్నారు. రాప్తాడు మండలంలోని పంగల్ రోడ్డు నందు రైతులు కార్మికులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రాప్తాడు ఎంపీడీవో ఆఫీస్ దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సంధర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.4 లేబర్ కోర్టులను వెంటనే రద్దు చేయాలని ఈనెల 9వ తేది దేశవ్యాప్తంగా సమ్మెను చేపడు తున్నాము అని తెలిపారు. కార్మిక వర్గం నేడు అనుభవిస్తున్న చట్టాలు అన్ని బ్రిటిష్ కాలం నుంచి కార్మికుల పోరాడి సాధిం చుకున్నవి. ఇది సమరశీల కార్మిక వర్గ చరిత్ర .ప్రైవేటీకరణ కాంట్రాక్టీకరణ అతి తక్కువ జీతాలతో పని చేయడం పని భద్రత లేకపోవడం లాంటి అనేక సమస్యలతో కార్మికవర్గం నేటికీ సతమతమ వుతోందన్నారు. ఇప్పుడు ఉన్న కార్మిక హక్కులకు రక్షణ కూడా లేకుండా కార్మిక వర్గాన్ని అనచడానికి తమ దోపిడీ తీవ్రం చేయడానికి కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ లను తెచ్చింది. కోవిడ్ కాలంలో ప్రజలంతా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కర్ఫ్యూలో బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్న కాలంలో అకస్మాత్తుగా ఈ కోడ్ లు ప్రత్యక్షమయ్యాయి అని అన్నారు. పార్లమెంటులో నామ మాత్రం చర్చ కూడా జరపకుండా బిజెపి ప్రభుత్వం బిల్లులకు కాంగ్రెస్ టిడిపి వైయస్సార్ సీపీలు పూర్తిగా మద్దతు ఇచ్చాయి.పార్లమెంటులో వామపక్షాలు డీఎంకే మాత్రమే వ్యతిరేకించాయి. సరళీకరణ విధానాలు అమలులో భాగమే లేబర్ కోడ్స్‌ను కార్మిక వర్గంపై రుద్దడం అని తెలిపారు. పెట్టుబడి దారులు అత్యంత లాభాలు అర్జించే క్రోని క్యాపిటలిజం అమల్లో ఉంది.అత్యధిక లాభాలు గడించడానికి ఇప్పుడున్న కార్మిక చట్టాలు ఏదో ఒక మేరకు ఆటంకంగా ఉన్నాయని పసిగట్టిన బిజెపి ప్రభుత్వం వాటిని మార్చి లేబర్ కోడ్స్ ను తెచ్చింది.మారిన పరిస్థితులకు అనుగుణంగా పాత కార్మిక చట్టాలు లేవని బ్రిటిష్ కాలం నాటి చట్టాలలోని లోపాలను తొలగించి యావత్ కార్మిక వర్గానికి ఉపయోగపడే లేబర్ కోడ్స్ తెచ్చామని బిజెపి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కార్మికులను రైతులను నట్టేట ముంచి పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్రం పరిపాలన సాగిస్తోంది. రైతులు కార్మికులు బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి అంగన్వాడీ కార్మికులు సావిత్రి భారతి విజయలక్ష్మి లక్ష్మీదేవి మల్లేశ్వరమ్మ హమాలీలు సుబ్బారావు ప్రతాప్ ప్రకాష్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వీరమల్లు.. బిజినెస్ సంగతేంటి?

**- ఈ సమయంలో డీల్స్ ఫైనల్ చేయకపోతే ఆఖరి నిమిషంలో లేనిపోని సమస్యలు వస్తాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. - అలాగే టికెట్ రేట్ల పెంపు విషయంలో కూడా క్లారిటీ రావాల్సి ఉంది.**



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా వస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా హరిహర వీరమల్లు సినిమాపై ప్రేక్షకుల్లో భారీగా ఆసక్తి నెలకొంది. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా గత కొంత కాలంగా వాయిదాలు పడుతూ వస్తోంది. కానీ ఇప్పుడు ఇక చివరి దశకు చేరింది. జూలై 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ట్రైలర్ తర్వాత బజ్ బాగానే పెరిగింది. పవన్ లుక్, గ్రాఫిక్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక సినిమాకు సంబంధించిన థియేట్రికల్ బిజినెస్ గురించి టాక్ జరుగుతోంది. ఫిల్మ్ నగర్ సమాచారం ప్రకారం నిర్మాత ఏఎం రత్నం ఏపీ-తెలంగాణ కలిపి సుమారు 140 కోట్లకు పైగా బిజినెస్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు పూర్తిగా డీల్స్ క్లోజ్ కాలేదట. ముఖ్యంగా నైజాం డీల్ ధర 65 కోట్ల వరకు పలుకుతుందని టాక్. కానీ ఇంకా సీడెడ్, ఆంధ్రా, కర్ణాటక ఏరియాల డీల్స్ తుది దశ చర్చల్లోనే ఉన్నట్టు సమాచారం. సినిమా విడుదలకు మరో పదిహేను రోజులు మాత్రమే ఉండటంతో బయ్యర్లు ఒత్తిడి పెడుతున్నట్టు ఇండస్ట్రీ టాక్. ఈ సమయంలో డీల్స్ ఫైనల్ చేయకపోతే ఆఖరి నిమిషంలో లేనిపోని సమస్యలు వస్తాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే టికెట్ రేట్ల పెంపు విషయంలో కూడా క్లారిటీ రావాల్సి ఉంది. బెనిఫిట్ షోలు ఎప్పటి నుంచి వేయాలన్నదీ ఇంకా ఫిక్స్ కాలేదు. వీటిపై త్వరగా నిర్ణయాలు తీసుకోకపోతే ప్రీ రిలీజ్ మూడ్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇవన్నీ పక్కన పెట్టినా హరిహర వీరమల్లుకి మంచి ఓపెనింగ్ దక్కడం మాత్రం ఖాయం. రీసెంట్‌గా వచ్చిన పెద్ద సినిమాల్లో సరైన హైప్ లేకపోవడంతో బాక్సాఫీస్ ఒక్కసారిగా డౌన్ అయ్యింది. ఈ సమయంలో మాస్ ప్రేక్షకులు మళ్లీ థియేటర్‌కి వచ్చేలా చేసే పవర్ ఈ సినిమాకే ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ రాజకీయ క్షేత్రంలో బిజీగా ఉన్నా, థియేటర్‌లో ఈ సినిమాతో తన స్టామినాను మళ్లీ నిరూపించే అవకాశం ఉంది. మొత్తానికి, బిజినెస్ పరంగా ఇంకా కొన్ని విషయాలు తేలాల్సినప్పటికీ, సినిమా కంటెంట్‌పై, మేకర్స్ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. ట్రైలర్‌లో చూపిన విసువల్స్, బ్యాక్‌డ్రాప్ సినిమాపై నమ్మకాన్ని పెంచాయి. ఓసారి పాజిటివ్ టాక్ వచ్చినట్లైతే.. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సాలిడ్ రన్ ఇవ్వడమే కాకుండా, కొత్త రికార్డుల కోసం దూసుకెళ్లే అవకాశం ఉంది. ఇక మిగతా డీల్స్ ఎప్పటి వరకు ఖరారవుతాయో చూడాలి.




# మారెమ్మ అంటున్న మాధవ్.. లుక్కు అదిరింది..!

**- మాధవ్ కూడా తన ఫస్ట్ సినిమాతోనే ఆడియన్స్‌లో ఒక ఇంపాక్ట్ క్రియేట్ చేయాలని చూస్తున్నాడు.**

మాస్ మహారాజ్ రవితేజ ఫ్యామిలీ నుంచి మాధవ్ హీరోగా పరిచయం అవుతున్నాడు. రవితేజ సోదరుడు రఘు తనయుడు మాధవ్ లీడ్ రోల్ లో వస్తున్న సినిమాకు మారెమ్మ అనే టైటిల్ లాక్ చేశారు. ఈ టైటిల్ పోస్టర్‌లో రఫ్ లుక్‌తో మాధవ్ ఇంప్రెస్ చేశాడు. వెనక ఎద్దు.. దాని ముందు రఫ్ లుక్ తో మాధవ్ తో మారెమ్మ పోస్టర్ ఇంప్రెస్ చేసింది. మాస్ లుక్ తో మారెమ్మ ఫస్ట్ లుక్ అదిరిపోయింది. మారెమ్మ సినిమాను మచల నాగరాజు డైరెక్ట్ చేస్తున్నారు.

రూరల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతున్న ఈ మూవీని మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. మారెమ్మ సినిమాలో మాధవ్ కి జతగా దీప బాలు నటిస్తుంది. మాధవ్ ఫస్ట్ లుక్ చూస్తే రవితేజ ఫ్యామిలీ హీరో కూడా ఆయన పంథాలో మాస్ మూవీస్ తోనే వస్తున్నాడని అనిపిస్తుంది. మాధవ్ కూడా తన ఫస్ట్ సినిమాతోనే ఆడియన్స్ లో ఒక ఇంపాక్ట్ క్రియేట్ చేయాలని చూస్తున్నాడు. ఇంట్లో స్వయంగా ఎదిగిన స్టార్ రవితేజ ఉన్నాడు కాబట్టి సినిమా పట్ల ఆయన చూపించే కమిట్మెంట్ మాధవ్ కూడా తెలుసుకుంటే కచ్చితంగా అతను కూడా మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకునే ఛాన్స్ ఉంటుంది. మారెమ్మ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఐతే పోస్టర్ కలర్ ఇంకా బ్యాక్ డ్రాప్ చూస్తుంటే మాత్రం ఈ సినిమా కచ్చితంగా మాస్ ఆడియన్స్ కి ఒక మంచి మాస్ ఫీస్ట్ అందిచేలా ఉందని చెప్పొచ్చు. మారెమ్మ అంటూ ఒక పవర్ ఫుల్ టైటిల్ తో వస్తున్న మాధవ్ తొలి సినిమాతో ఏమేరకు ప్రేక్షకులను మెప్పిస్తాడు అన్నది చూడాలి.

ఎంత వెనుక రవితేజ ఉన్నా కూడా మాధవ్ తన టాలెంట్ చూపించాల్సిన అవసరం ఉంది. సో ఆడియన్స్ కు నచ్చే కంటెంట్.. వాళ్లని మెప్పించే టాలెంట్ ఉంటే ఎలాంటి నేపథ్యం ఉన్నా లేకపోయినా ఆదరణ లభిస్తుంది. సో ఈ విషయంలో చాలామంది ఇప్పటికే ప్రూవ్ చేయబడ్డారు. మాధవ్ విషయంలో రవితేజ సపోర్ట్ కూడా ఉంటుంది కాబట్టి అతను కాస్త ఎఫర్ట్ పెట్టి ఆడియన్స్ ని ఇంప్రెస్ చేయగలిగితే ఇండస్ట్రీలో హీరోగా మంచి మార్కులు కొట్టే అవకాశం ఉంటుంది.



# ఒక్కడే 367 కొట్టాడు..

**- 400 ముంగిట డిక్లేర్డ్ ...**
**- కెప్టెన్ కూడా అతడే పైగా అయితే, 367 నాటౌట్ (334 బంతుల్లో 49 ఫోర్లు, 4 సిక్స్‌లు) వద్ద ఉండగా అనూహ్యంగా డిక్లేర్ చేశాడు.**



టెస్టు మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేయడమే గగనం.. ట్రిపుల్ సెంచరీ అంటే చాలా కష్టం.. ఏకంగా క్వాడ్రాపుల్ సెంచరీ (400) అంటే అసాధ?యమే అని చెప్పాలి. వెస్టిండీస్ దిగ్గజ బ్యాట్స్‌మన్ బ్రియాన్ లారా 2004లో ఇంగ్లండ్‌ను ఉతికిఆరేస్తూ సాధించిన క్వాడ్రాపుల్ సెంచరీ (400 నాటౌట్) ఇంకా బద్దలవలేదు. 21 ఏళ్లలో ఈ రికార్డుకు దగ్గరగా వచ్చిన బ్యాట్స్‌మన్ కూడా లేరు. అలాంటిది.. ఇప్పుడు ఓ బ్యాట్స్‌మన్ కు 400 సాధించే అవకాశం దక్కింది. కానీ, అతడు చేసిన పని అతడికే అరుదైన రికార్డును దూరం చేసంది. %ూశ్రీంశీ =ఝఱ% - క్రికెట్ లోకి కోహ్లి 'కొడుకొచ్చాడు..' రూ.లక్షకు కొన్న ఢిల్లీ తమ పక్కనే ఉండే జింబాబ్వేలో ప్రపంచ టెస్టు చాంపియన్ దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు టూర్ చేస్తోంది. మూడు టెస్టుల సిరీస్ ఆడుతోంది. ప్రస్తుతం మూడో టెస్టు జరుగుతోంది. ఆదివారం ప్రారంభమైన ఈ టెస్టులో దక్షిణాఫ్రికాకు కెప్టెన్ వియాన్ ముల్డర్. సీనియర్లు అందరూ విశ్రాంతి తీసుకోవడంతో ముల్డర్ కెప్టెన్సీ చేస్తున్నాడు. తొలి రోజు 259 బంతుల్లోనే 264 పరుగులు బాదేసిన అతడు.. సోమవారం రెండో రోజు మరో 103 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ట్రిపుల్ సెంచరీ దాటేశాడు. %ూశ్రీంశీ =ఝఱ% - ఎడ్జ్ బాస్టన్ లో రికార్డులతో తొలి విజయం..చరిత్ర తిరగరాసిన టీమ్‌ఇండియా అయితే, 367 నాటౌట్ (334 బంతుల్లో 49 ఫోర్లు, 4 సిక్స్‌లు) వద్ద ఉండగా అనూహ్యంగా డిక్లేర్ చేశాడు. నిండా ఒకటిన్నర రోజు ఆట కూడా పూర్తికాలేదు. మంచి జోరు మీద ఉన్నాడు.. కేవలం 34 పరుగులు చేస్తే టెస్టుల్లో క్వాడ్రాపుల్ సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచే అరుదైన రికార్డు అందుకునేవాడు. పైగా డిక్లేర్ ఇచ్చే అధికారం ఉన్న జట్టు కెప్టెన్ కూడా. అయినా ఎవరికీ సాధ్యం కాని రికార్డును వద్దనుకున్నాడు. ఇన్నింగ్స్‌ను 626/5 వద్ద డిక్లేర్ చేసి ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచాడు.ఒక్క రోజులో 536.. ఇంగ్లండ్ కొట్టేస్తుందా? వాళ్ల కోచ్ మాట ఇదే... దక్షిణాఫ్రికా తరఫున ట్రిపుల్ సెంచరీ చేసిన రెండో బ్యాటర్ ముల్డర్. కేవలం 297 పరుగుల్లోనే 300 కొట్టేశాడు. ఇది రెండో ఫాస్టెస్ట్ ట్రిపుల్. కెప్టెన్సీ చేస్తున్న తొలి మ్యాచ్ కూడా. ఇవన్నీ రికార్డులే. -సఫారీల తరఫున తొలి ట్రిపుల్ సెంచరీ హషీమ్ ఆమ్లా (311 నాటౌట్) పేరిట ఉంది. పాకిస్థాన్ బ్యాటర్ మొహ్మద్ హనీఫ్ (337, వెస్టిండీస్‌పై, 1958)తర్వాత విదేశాల్లో అత్యధిక పరుగులు చేసిన దక్షిణాఫ్రికా బ్యాటర్ కూడా ముల్డరే. డిక్లరేషన్ అనంతరం జింబాబ్వేను 170కే ఆలౌట్ చేసింది దక్షిణాఫ్రికా. - రన్ మెషిన్ శుభ్ మన్ గిల్.. ఈ సిరీస్ లో 'వెయ్యి' కొట్టేస్తాడా? కాగా, లారా తర్వాత రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ హేడెన్ ది. 2003లో జింబాబ్వేపై 380 పరుగులు చేశాడు. దీనికిముందు అతడు లారా (375 ఇంగ్లాండ్‌పై 1994లో) రికార్డునే బ్రేక్ చేశాడు. శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్దనె 2006లో దక్షిణాఫ్రికాపై 374 కొట్టాడు. వీరి తర్వాత ముల్డర్ నిలిచాడు. ప్రస్తుతం ఇంగ్లండ్‌లో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో టెస్టులో 269 వద్ద ఔటయ్యాడు. మరి గిల్.. మిగతా మూడు టెస్టుల్లో ట్రిపుల్ కొట్టేస్తాడా..?



# ఎడ్జ్ బాస్టన్ లో రికార్డులతో తొలి విజయం..

చరిత్ర తిరగరాసిన టీమ్‌ఇండియా ఐదో రోజు ఇంగ్లండ్ ఏడు వికెట్లు తీయడానికి టీమ్ ఇండియా కాస్త శ్రమించింది. వర్షం కారణంగా ఆట ఆలస్యంగా ప్రారంభం కావడంతో మన జట్టు గెలుస్తుందా? అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఇప్పటివరకు 8 టెస్టులు ఆడితే ఒక్కదాంట్లోనూ గెలవలేదు.. ఒక్కటే డ్రా.. ఏడు ఓటములు... ఈ రికార్డుతో ఎడ్జ్ బాస్టన్ లో రెండో టెస్టు బరిలో దిగిన టీమ్ ఇండియా రికార్డును తిరగరాస్తూ తొలి గెలుపును సొంతం చేసుకుంది. 608 పరుగుల అత్యంత భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ కు దిగిన ఇంగ్లండ్ ను కేవలం 271 పరుగులకు ఆలౌట్ చేసింది.

336 పరుగుల భారీ తేడాతో విజయం సొంతం చేసుకుంది. విదేశాల్లో భారత జట్టుకు పరుగుల పరంగా ఇదే అత్యంత భారీ విజయం. దీంతో ఐదు టెస్టుల సిరీస్ ను 1-1తో సొంతం చేసుకుంది.

# పవన్ మీద తొలుగుతున్న భ్రమలు



**ఏలూరు- సూర్య వాస్తవం:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇంకా 2024 ఎన్నికల తరహాలోనే ఆలోచిస్తున్నారు. వైసీపీ పై విమర్శలు చేయడం మాని తమ ప్రభుత్వం ఏం చేయనుందో చెబితే బాగుంటుంది. మళ్లీ వైసీపీని అధికారంలోకి రానివ్వ నంటూ శప థాలు చేసినంత మాత్రాన ఈసారి సాధ్యం కాకపోవచ్చు. 2024 ఎన్నికలకు,2029 ఎన్నికలకు చాలా తేడా ఉంటుంది. అప్పు డంటే పవన్ కల్యాణ్ ను అధికారంలో అప్పటి వరకూ ఎవరూ చూడలేదు. పవన్ కల్యాణ్‌కు అధికారం ఇస్తే తమకు మంచిజరు గుతుందని భావి ంచారు. అంతేకాదు కూటమి ప్రభు త్వంలో మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే శక్తి జనసేనానికి ఉందని నమ్మి ప్రజలు ఓటేశారు కానీ ఏడాదికే విషయం అర్థమయిపోయిందని జనసేన పార్టీ నేతలే అంటున్నారు. తాము మొన్నటి ఎన్నికల్లో పార్టీకోసం కష్టపడి జెండాను మోసి త్యాగాలు చేసినా అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోకపోయినా అడిగే నాథుడే లేని వాపోతున్నారు. అనేక మంది జనసేన నాయకుల్లో ఇదే అభిప్రాయం ఉంది. ప్రశ్నించే తత్వాన్ని పవన్ కోల్పోయారని, కేవలం రాజీ పడుతూ తన పదవి కోసమే ఉన్నారన్న కామెంట్స్ ఆ పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. తాము గత ఎన్నికల్లో ఖర్చు చేసి ఆర్థికంగా నష్టపోయినా తమను ఆదుకునే వారు కూడా లేరని అంటున్నారు. కోవూరు నియోజకవర్గం జనసేన నేత ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా ప్రస్తావించాలి.

తాము అడుక్కు తింటున్నా పట్టించుకోరా? అని పవన్ కల్యాణ్ ను ప్రశ్నించారంటే పరిస్థితికి అద్దం పడుతుంది లీడర్లలోనూ... ఇది కేవలం జనసేన నేతలు మాత్రమే కాదు. క్యాడర్ లోనూ, కాపు సామాజి కవర్గంలోనూ ఇదే అభిప్రాయం ఉంది. పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత తమను పూర్తిగా పక్కన పెట్టేశారని బహిరంగంగానే చెబుతున్నారు. నియోజ కవర్గాల్లో టీడీపీ నేతలు తమను పట్టించుకోవడం లేదని గోడు వెళ్లబోసుకుంటున్నా పట్టించుకునే వారు లేరని వారు ఆవేదన చెందుతున్నారు. కేవలం తన మంత్రిత్వ శాఖ విషయంపై చూసుకుంటూ పార్టీని పూర్తిగా వదిలేస్తే వచ్చే ఎన్నికల్లో జెండాను పట్టుకుని ఎవరు తిరుగుతారని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు జరిగి ఏడాది కాకముందే జనసేన క్యాడర్ లోనూ, నేతల్లోనూ, కాపు సామాజికవర్గంలోనూ పవన్‌పై ఉన్న భ్రమలు తొలగి పోయాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి.. ఇక జనంలో కూడా పవన్ కల్యాణ్ ఈ ఏడాది కాలంలోనే పలుచన అయ్యారని చెప్పక తప్పదు. ఎన్నికల ప్రచార సభల్లో ఊగి పోయిన పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే తలూపడం మినహా మరేమీ చేయలేకపోతున్నారన్న బలమైన అభిప్రాయం ప్రజల్లో ఉందన్నది అనేక సర్వేల్లో వెల్లడవుతున్న వాస్తవాలు. ప్రభుత్వంలో ఉంటూ అధికార పక్షాన్ని నిలదీయమని చెప్పడం లేదు కానీ కనీసం ముఖ్యమైన సమస్యల విషయంలో చంద్రబాబు నాయుడు వద్ద ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయకుండా వైసీపీని మళ్లీ అధికారంలోకి రాని వ్వనంటూ శపథాలు చేసినంత మాత్రాన సరిపోదని సోషల్ మీడియాలో కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. ముందుగా తమ పాలనపై సమీక్ష చేసుకుని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో భాగస్వామి కావాలని కోరుతున్నారు.




# ఘనంగా అనంత సాహితీ ఉత్సవం

**రాప్తాడు -సూర్య వాస్తవం, జులై 7:** అనంత సాహితీ ఉత్సవం జాతీయ శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమంను ఘనంగా నిర్వహించామని లేపాక్షి ఫౌండేషన్ అధ్యక్షులు వడ్డే సుధాకర్ పేర్కొన్నారు.లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంత సాహితీ ఉత్సవం జాతీయ శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శశాంక్ మౌలి హాజరయ్యారు.ఈ సంధర్భంగా జి.అశోక్ కుమార్ రాసిన మౌన అక్షరాలు కవితా సంపుటి పుస్తక ఆవిష్కరణ చేశారు. ఈ సంధర్భంగా కవి జి అశోక్ కుమార్ మాట్లాడుతూగా మౌన అక్షరాలు పుస్తక రూపకల్పనకు చాలామంది కవులు మిత్రులు బంధువులు ప్రోత్సాహం అందించిన వారికి మరియు ఈ కార్యక్రమం విజయానికి దోహదపడిన జనసేన జిల్లా అధ్యక్షులు మరియు అహుడ చైర్మన్ టి సి వరుణ్ జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు లైబ్రరీ ఇన్చార్జ్ రమా విజయసాయి ట్రస్ట్ వ్యవస్థాపకులు విజయ్ సాయి పొట్లూరి కేశవకు పేరుపేరునా హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని అన్నారు.అనంతరం కవులకు పెద్దలకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించి మొమెంటోలు అందజేసి ఘనసత్కారం చేశారు. అనంతరం రాష్ట్ర జిల్లా కమిటీలకు ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాల ప్రతినిధులు శ్రీనివాసులు చంద్రశేఖర్ విజయ్ కుమార్ బాలాజీ అంపయ్య శశికళ ఉదయ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ చిర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అబ్బవరం రెడ్డి శేఖర్ రెడ్డి భౌతికకాయానికి నివాళి

**రాయచోటి-సూర్య వాస్తవం, జులై 7:** రాయచోటి నియోజకవర్గం, చిన్న మండెం మండలం పరిధిలోని వండాడి దగ్గర ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెంది ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రెడ్డి శేఖర్ రెడ్డి భౌతికకాయాని కి రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు విచ్చేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ రెడ్డి శేఖర్ రెడ్డి కుటుంబానికి ఈ సమస్య వచ్చిన అండగా ఉంటామని ఆయన చెప్పారు.



## ఉపాధి హామీ పథకాన్ని

# రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి

**-రాష్ట్ర రవాణా,యుజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**రాయచోటి-సూర్య వాస్తవం, జులై 7:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి మండలం, గొర్లమొదివీడు పంచాయతీ నందు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముస్లిం రైతు పొలంలో మామిడి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యతని స్తోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగి, ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటిన రైతులకు వాటి సంరక్షణ కొరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. రైతులందరూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకం చేపట్టి ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. జూలై 8వ తేదీన అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకాన్ని చేపట్టాలని డ్వామా పిడి ఆదేశించడం జరిగిందని సోమవారం మంత్రి అందుబాటులోఉండకపోవడం రాయచోటి మండల ంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఉపాధి హామీ పథకం ఏపీఓ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు రైతులు పాల్గొన్నారు.

# 25 ఏళ్ల తర్వాత తీరనున్న కల



**కాకినాడ-సూర్య వాస్తవం, జులై 7:** కోనసీమ వాసులకు గుడ్ న్యూస్. అప్పుడెప్పుడో 2000లో ప్రారంభమైన ప్రాజెక్టు ఇన్నాళ్లకు కదలిక వచ్చింది. కోర్టు కేసులు ఇతర సమస్యలతో మూలనపడిన రైల్వే ప్రాజెక్టు ఇప్పుడు వేగంగా సాగుతందని ప్రజలు భావిస్తున్నారు. కోనసీమ రైల్వేలైన్ నిర్మాణానికి 2000లో శంకుస్థాపన చేశారు. కాకినాడ నుంచి కోటిపల్లి, అమలాపురం, రాజోలు, సిద్ధాంతం మీదుగా నర్సాపురం వరకు ఈ కోస్తా రైల్వే లైన్ నిర్మించాలని అప్పట్లో ప్రభుత్వం భావించింది. తొలి అలైన్‌మెంట్ 2001లో వచ్చింది. కాకినాడ నుంచి కోటిపల్లి వరకు పనులు కూడా మొదలయ్యాయి. వివిధ కారణాలతో అక్కడి నుంచి ప్రాజెక్టు ముందుకు కదల్లేదు. ఇప్పుడు కోర్టు కేసులు క్లియర్ కావడంతో ప్రక్రియ ముందుకు సాగే సూచనలు కనిపిస్తున్నాయి. రైల్వేలైన్ భూసేకరణ, రీ అలైన్‌మెంట్ సర్వేల విషయంలో చాలా మంది రైతులు కోర్టును ఆశ్రయించారు. అప్పట్లో తక్కువ పరిహారం ఇచ్చారని మరింత కావాలంటూ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. పరిహారంలో జరిగిన అన్యాయాన్ని సరి చేయాలని పాతికేళ్లుగా పోరాడుతున్నారు. దీంతో పనులపై ఇన్ని రోజులు కోర్టులు స్టే విధించాయి. ఇన్ని రోజులు విచారణ తర్వాత కోర్టులు ఆ స్టేలను ఎత్తివేస్తూ బుధవారం నిర్ణయం తీసుకుంది. దీంతో పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా పోయింది. 102.507 కిలోమీటర్ల పొడవుతో రైల్వేలైన్ నిర్మించాలని ప్లాన్ చేశారు. ఇందులో కాకినాడ నుంచి కోటిపల్లి వరకు అంటే దాదాపు 45కిలోమీటర్ల నిర్మాణం పూర్తి అయింది. ఇంకా యాభై కిలోమీటర్లకు పైగా లైన్ నిర్మించాల్సి ఉంది. కోటిపల్లి నుంచి నర్సాపురం ఉన్న భూసేకరణ సమస్యతో పనులకు ఆటంకం ఏర్పడింది. కోటిపల్లి నుంచి భట్నవిల్లి వరకు భూసేకరణ ప్రక్రియ పూర్తి అయింది. అక్కడి నుంచి నర్సాపురం వరకు చేపట్టాల్సిన భూసేకరణే ఈ ప్రాజెక్టుకు అడ్డంకిగా మారింది. ఏదోలా చేసి పనులు పూర్తి చేయాలని 2016 నుంచి జరుగుతున్న ప్రయత్నాలు సఫలం కాలేదు. పదేళ్లుగా గోదావరి మూడు నదీపాయలపై పిల్లర్ల పనులు పూర్తి చేశారు. మిగతా పనులకు టెండర్లు కూడా ఖరారు అయ్యాయి. కానీ పనుల్లో మాత్రం వేగం కనిపించలేదు. వైసీపీ ప్రభుత్వం ఈ రైల్వేలైన్ కోసం కావాల్సిన భూసేకరణకు చర్యలు చేపట్టింది. 2024 ఫిబ్రవరిలో 50 కోట్ల రూపాయల నిధులు కూడా మంజూరు చేసింది. అమలాపురం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలలో భూసర్వే కూడా చేపట్టారు. కానీ పనుల్లో పురోగతి కనిపించలేదు. కోర్టు కేసులతోపాటు అలైన్‌మెంట్‌లో వచ్చిన సమస్యలు కూడా పనులు జాప్యానికి కారణంగా చెప్పవచ్చు. 216 బైపాస్ నిర్మాణం కారణంగా రైల్వే ట్రాక్‌కు ఆనుకొని రోడ్డు వెళ్తోంది. దీని వల్ల రైల్వేట్రాక్ నిర్మాణం సరికాదని నిపుణులు అభిప్రాయపడ్డారు. రోడ్డు దిగిన వెంటనే ట్రాక్ దాటాల్సి ఉందని ఇది భవిష్యత్‌లో ప్రమాదాలకు కారణమవుతుందని కూడా తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని అంచనా వేశారు. ఈ సమస్యలు గుర్తించి అలైన్మెంట్ మార్చారు. బైపాస్ స్టార్ట్ కాక మందే రైల్వేలైన్ వెళ్లేలా ప్లాన్ చేశారు. దీని ప్రకారం భట్నవిల్లి, కామనగరువు, చిందాడగరువు, రోళ్లపాలెం, ఇమ్మిడివరప్పాడు, పేరూరుపేట మీదుగా బోడసకుర్రు రైల్వేలైన్ నిర్మాణం చేపట్టారు. ఈ ప్లాన్ ప్రకారం రెండు చోట్ల మాత్రమే 216 జాతీయ రహదారి మీదుగా రైల్వేలైన్ వెళు ంది. ఇప్పుడు కొత్త అలైన్మెంట్‌కు ఆమోదం, కోర్టు కేసులో ఎత్తివేయడంతో అధికారులు పనులు వేగం పెంచారు. భూసేకరణ ప్రక్రియ వేగం పెంచారు. ఈ సేకరణ పూర్తి అయితే పెండింగ్ పనులు పూర్తి కావడానికి ఎంతో సమయం పట్టదని అధికారులు అంటున్నారు.

# కొబ్బరి రైతులకు పండుగ...



**అమలాపురం,-సూర్య వాస్తవం, జులై 7:** ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి రైతులకు ఇది నిజంగా పండుగ సమయం! చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కొబ్బరికి రికార్డు స్థాయి ధర లభించింది. వెయ్యి కొబ్బరి కాయల ధర ఏకంగా రూ.22 వేలు పలకడంతో రైతులు ఆనందంతో ఉబ్బిత బ్బిబ్బవు తున్నారు. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి తగ్గడంతో ఆంధ్రా కొబ్బరికి డిమాండ్ పెరిగింది. ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ధరలు రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం ఇస్తున్నాయి. పండించిన పంటకు మద్దతు ధర లభిస్తే.. అన్నదాతల కళ్లలో ఆనందం నిలుస్తుంది. వారు అన్ని రోజుల పడ్డ కష్టాన్ని మర్చిపోతారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి రైతుల పరిస్థితి కూడా ఇలానే ఉంది. చరిత్రలోనే తొలిసారి రికార్డు స్థాయిలో ధర పలికింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక జాతీయ మార్కెట్‌లో ఆంధ్రా కొబ్బరి రికార్డుల మీద రికార్డులు క్రియేట్ చేస్తుంది. కొబ్బరి చరిత్రలో తొలిసారి వెయ్యి కొబ్బరి కాయల ధర ఏకంగా 22 వేల రూపాయలు పలికింది. ఆవివరాలు.. ఈ ఏడాది ఆంధ్రా మినహా మిగిలిన దక్షిణాది రాష్ట్రాల్లో అనగా.. తమిళనాడు, కర్ణాటక, కేరళలలో కొబ్బరి కాయల దిగుబడి భారీగి తగ్గిపోయింది. ఇది కాస్త ఆంధ్రా కొబ్బరి రైతులకు కలిసి వచ్చింది. పంట దిగుబడి సరిగా లేకపోవడం చేత... కొబ్బరి చరిత్రలో తొలిసారి అంబాజీపేట మార్కెట్‌లో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.22 వేలు పలికింది. లంక గ్రామాల్లో అయితే వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.23 వేల వరకూ పలుకుతోందని రైతులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోనే కొబ్బరి సాగుతుంది. రెండు జిల్లాల్లో కలిపి సుమారు 1.8 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుండగా.. ఒక్క కోనసీమ జిల్లాలోనే 1.10 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు రైతులు. ఇక గత సంవత్సరం నుంచి కొబ్బరి ధర రూ.10 వేలకు తగ్గడం లేదు. పచ్చికాయ, నిల్వ కాయ ధరలు ఇలానే స్థిరంగా కొనసాగుతున్నాయి. ఇక గతేడాది మే నెలలో ఒకానొక సందర్భంలో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.12 వేల వరకూ పలికింది. ఇక ఈ ఏడాదిమే చివరి వారంలో రూ.16 వేలకు చేరింది.ఈ నెల అనగా జూన్ మొదటి వారంలో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.17,500 నుంచి రూ.18,500 వరకూ పెరిగింది.

ఈ ధరలు ఇలానే పెరుగుతూ వస్తూ.. శనివారం నాడు ఏకంగా రూ.22 వేలు పలికింది. రానున్న వారం రోజుల్లో కొబ్బరి ధర మరింత పెరిగే అవకాశం ఉంది అంటున్నారు. ఇక దక్షిణాది రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడి భారీ స్థాయిలో పడిపోయింది. ఇక కేరళలో కొబ్బరి దిగుబడి మరింత పతనమైంయింది. దీంతో మార్కెట్‌లో కొబ్బరికి భారీ ఎత్తున్న డిమాండ్ ఉండటతో.. మంచి ధర పలుకుతుంది. పోయిన సంవత్సరం నుంచి రైతుల వద్ద కానీ, వ్యాపారుల వద్ద కానీ కొబ్బరి నిల్వ ఉండటం లేదు. వచ్చిన పంట వచ్చినట్లే అమ్ముడవుతుంది. ఇక ప్రస్తుతం కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండటంతో వారం రోజుల వ్యవధిలోనే ఎగుమతి అవుతోంది. ధరల పెరుగుదలకు ఇది కూడా ఓ కారణం అంటున్నారు. ఇక ఏపీ నుంచి హర్యానా, బిహార్, యూపీ, గుజరాత్, మహారాష్ట్రలకు పచ్చికాయ అధికంగా ఎగుమతి అవుతోంది. పెరిగిన ధర కొబ్బరి రైతుల్లో సంతోషం నింపింది.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )